ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -239 పేజీలు - 08 వెల - 04/- మంగళవారం1 జులై 2025



2లో

## నేటి నుంచి పెరిగిన రైల్వే ఛార్జీల అమలు

- తత్కాల్ బుకింగ్‌కు ఆధార్ తప్పనిసరి

## 8రోజులు,5దేశాల్లో !

జులై 2 నుంచి 9 వరకు ప్రధాని మోదీ 8 రోజుల విదేశీ పర్యటన

ఘనా, ట్రినిడాడ్, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియాలను సందర్శించనున్న ప్రధాని

బ్రెజిల్‌లో జరగనున్న 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొననున్న మోదీ

గ్లోబల్ సౌత్ దేశాలతో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే ప్రధాన లక్ష్యం



2లో



## చెవిరెడ్డికి మూడు రోజుల కస్టడీ

చెవిరెడ్డితో పాటు వెంకటేశ్ నాయుడు పోలీస్ కస్టడీ

విచారణ కోసం జులై 1 నుంచి 3 వరకు కోర్టు అనుమతి

2లో

ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలీసుల విచారణ

ఇదే కేసులో చెవిరెడ్డి కుమారుడు మోహిత్ రెడ్డి బెయిల్ పిటిషన్ తిరస్కరణ

## అమెరికా సిలికాన్ వ్యాలీ లాగే

# మన క్వాంటమ్ వ్యాలీ

క్వాంటమ్ కంప్యూటింగ్‌ను అందిపుచ్చుకోవాలి



ఐటీపై ఆలోచన చేస్తే చాలదు... ఎకోసిస్టమ్ క్రియేట్ చేయాలి

వాట్సాప్ చాట్ బోట్ ద్వారానే ప్రభుత్వ సర్వీసులు సేవలు

గ్రీన్ ఎనర్జీలో ఏపీ చాలా బలంగా ఉంది

ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీలకు వేదికగా హైదరాబాద్

ఎపి సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ,జూన్ 30 ఆంధ్ర ప్రగతి**

క్వాంటమ్ కంప్యూటింగ్‌ను మనం అందిపుచ్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించారు. 1990లలో ఇంటర్నెట్ వల్ల ప్రపంచం ఓ గ్లోబల్ విలేజ్‌గా మారిందని ఉద్ఘాటించారు. ఐటీపై ఆలోచన చేస్తే చాలదు... దానికి ఎకోసిస్టమ్ క్రియేట్ చేయాలని సూచించారు. ఇప్పుడు హైదరాబాద్ ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీలకు వేదికగా మారిందని వెల్లడించారు. మిగతాది 2లో...



## ఎపి బిజెపి అధ్యక్షుడిగా మాధవ్



**విజయవాడజూన్ 30 ఆంధ్ర ప్రగతి**ఏపీ భాజపా అధ్యక్షుడి ఎంపిక కొలిక్కి వచ్చింది. అధ్యక్ష పదవికి మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ పేరును ఆ పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయన.. గతంలో శాసన మండలిలో భాజపా ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. ఆర్ఎస్ఎస్, బీజేవైఎంలో బాధ్యతలు నిర్వర్తించారు. మాధవ్.. భాజపా సీనియర్ నేత, దివంగత చలపతిరావు కుమారుడు. ఆయన తండ్రి రెండుసార్లు ఎమ్మెల్సీగా పనిచేశారు. అధ్యక్ష పదవికి మధ్యాహ్నం 2 గంటల తర్వాత మాధవ్ నామినేషన్ దాఖలు చేసారు. విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం అధ్యక్ష ఎన్నిక నిర్వహించనున్నారు. కర్ణాటక ఎంపీ మోహన్ ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించనున్నారు. దీంతో ఆయన ఎన్నికను ఏకగ్రీవంగా ప్రకటించనున్నారు. పార్టీలో సుదీర్ఘకాలం ఉన్న కారణంగా ఆయనకు అవకాశం దక్కింది.

## పాశమైలారం కెమికల్

# ఫ్యాక్టరీలో భారీ పేలుడు



2లో



- మంటలు చెలరేగి పదిమంది దుర్మరణం
- వెంటనే సహాయక చర్యలకు దిగిన అధికారులు
- వివిధ ఆస్పత్రుల్లో చికిత్స

# బనకచర్లకు

## అనుమతులు ఇవ్వలేం

పర్యావరణ అనుమతులకు సీడబ్ల్యూసీని సంప్రదించండి

- ప్రాజెక్టుపై అనేక అభ్యంతరాలు ఉన్నాయి
- కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ స్పష్టం



**న్యూఢిల్లీ,జూన్ 30 ఆంధ్ర ప్రగతి**పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వలేమని కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ స్పష్టం చేసిం ది. ప్రాజెక్టుపై అనేక అభ్యంతరాలు వచ్చాయని, అనుమతులు ఇవ్వాలంటే గోదావరి వాటర్ డిస్ప్యూట్ ట్రైబ్యునల్ (జీడబ్ల్యూడీటీ) తీర్పును పరిశీలించాల్సి ఉందని తెలిపింది. పర్యావరణ అనుమ తులకు సీడబ్ల్యూసీని సంప్రదిం చడం అత్యవసరమని కమిటీ అభిప్రాయ పడింది. బనకచర్ల ప్రాజెక్టును ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టినట్లు ఏపీ ప్రభుత్వం ఇచ్చిన నివేదికను నిపుణుల కమిటీ పరిశీలిం చింది. అయితే, 1983లో గోదావరి ట్రైబ్యునల్ ఇచ్చిన మిగతాది 2లో...

# క్వాంటమ్ కంప్యూటింగ్‌ను అందిపుచ్చుకోవాలి

ఇప్పుడు హైదరాబాద్ ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీలకు వేదికగా మారిందని వెల్లడించారు. క్వాంటమ్ వ్యాలీపై విజయవాడలోని ఓ హోటల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నేషనల్ వర్క్‌షాప్ నిర్వహించారు. దీనికి ఐటీ, ఫార్మా, వాణిజ్య, నిర్మాణ రంగాలకు చెందిన దిగ్గజ కంపెనీల ప్రతినిధులు,
కేంద్ర ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. 1995 టెక్నాలజీ రివెల్యూషన్‌ను ఇండియా పొందింది.. దానిలో తన పాత్ర కూడా ఉందని గుర్తుచేసుకున్నారు సీఎం చంద్రబాబు.ఏపీకి ఎన్నో అడ్వాంటేజీలు ఉన్నాయని.. శ్రీహరికోట రాకెట్ లాంచింగ్ ఇక్కడే ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఏరోస్పేస్ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని అన్నారు. ఏపీ గ్రీన్ ఎనర్జీలో చాలా బలంగా ఉందని చెప్పారు. 1989లో కుప్పం నుంచి పోటీచేస్తూ ఒక పబ్లిక్ మీటింగ్‌లో తాను ఎలక్ట్రానిక్ ఎక్స్ఛేంజ్ తెస్తానని చెప్పానని.. అయితే ఆ విషయంతో తన ప్రత్యర్థులు తప్పుపట్టారని గుర్తుచేశారు. ప్రభుత్వ సర్వీసులు అన్నిసేవలను ఆగస్టు 15వ తేదీ నాటికి వాట్సాప్ చాట్ బోట్ ద్వారానే నిర్వహిస్తాయని స్పష్టం చేశారు. జనవరి ఒకటోవ తేదీ నాటికి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ అమరావతి నుంచి ప్రారంభమవుతుందని ప్రకటించారు. దీనికోసం ఎకో సిస్టంతో పాటు యూజ్ కేస్‌లు కూడా రావాలని సూచించారు. టాప్ ఏఐ యూసేజ్‌లో చైనా, యూఎస్, ఇండియా మాత్రమే ముందు ఉన్నాయని వివరించారు. టీసీఎస్ మనతో ముందునుంచి ట్రావెల్ చేస్తోందని.. ఇప్పుడు డేటాలింక్‌పై పనిచేస్తుందని చంద్రబాబు వెల్లడించారు. 'నిజానికి క్వాంటమ్ కంప్యూటింగ్‌ను ప్రమోట్ చేయాలనుకున్నాం. దీనిపై ముఖ్యమైన వ్యక్తులను ఆహ్వానించాలనుకున్నాం. ఆ సమయంలోనే భారత ప్రభుత్వం క్వాంటమ్ కంప్యూటింగ్ మిషన్‌ను అనౌన్స్ చేసింది. వెంటనే కామకోటి మా వద్దకు వచ్చి ఈ విషయం చెప్పారు. వెంటనే నేను కేంద్ర ప్రభుత్వాన్ని అడిగా... వారు ఓకే చెప్పారు. ఎలా ముందుకు వెళ్లాలని కూడా అడిగాం. ఈ రంగంలో మరింతమంది ముందుకు రావాలని ఎకో సిస్టంను టీసీఎస్, ఐబీఎం, ఎల్ అండ్ టీ ద్వారా చేయగలిగాం. ఐటీపై ఆలోచన చేస్తే చాలదు... దానికి ఎకోసిస్టం క్రియేట్ చేయాలి. ఐటీని నేను 1983–84లోనే అప్లైడ్ చేశాను. లోకేష్ పుట్టిన సమయం అది. దానిలో భాగంగా నేను అమెరికా వెళ్లాను.... మైక్రోసాఫ్ట్‌తో పాటు అన్ని నగరాలు తిరిగి ప్రయత్నం చేశాను. బ్రిటిష్ వాళ్లు మన కోహినూరు డైమెండ్‌ను తీసుకుపోయినా.. ఇక్కడ ఇంగ్లీష్ వదిలి వెళ్లారు. నేను అమెరికా నుంచి తిరిగి రాగానే అనేక ఇంజనీరింగ్ కాలేజ్‌లు ప్రారంభించి ఐటీ ఎడ్యూకేషన్‌ను పెంచాను. ఇప్పుడు హైదరాబాద్ ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీలకు వేదికగా మారింది. మేము గర్వంగా చెబుతున్నాం మేము మీదేశానికి సేవ చేస్తున్నాం అంటూ
అమెరికన్ కాన్సులెట్ జనరల్‌తో చెప్పారు. గతంలో ఎక్కువ ఫోన్ బిల్లు వస్తుందని నేను లోకేష్‌కు అమెరికా కూడా ఫోన్ చేయలేకపోయాను. దీంతో ఇతర దేశాల్లో పరిణామాలు చూశాను... సెల్‌ఫోన్ తేవాలని చెప్పాను. అయితే అప్పట్లో పేదరికం గురించి మాట్లాడేవారు...సెల్‌ఫోన్ ఎలా అన్నారు. ఇప్పుడు భర్త లేకుండా భార్య, భార్య లేకుండా భర్త జీవించగలుగుతున్నారు. అయితే వీరిద్దరూ సెల్ లేకుండా ఉండలేకపోతున్నారు' అంటూ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇప్పుడు తెలంగాణా రాష్ట్ర ఆదాయంలో 75 శాతం రెవెన్యూ హైదరాబాద్ నుంచే వస్తోంది.. ఐటీ సెక్టార్ తో పాటు వేర్వేరు రంగాల్లో తెలుగు వారే కీలకంగా ఉన్నారని తెలిపారు. కేవలం ఈ 25 ఏళ్లలోనే ఈ మార్పులన్నీ వచ్చాయి.. అమెరికాలో సిలికాన్ వ్యాలీ ఉంటే అమరావతిలో క్వాంటం వ్యాలీ ఉండాలన్న లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మానవాళి జీవితంలో సాంకేతిక పరిజ్ఞానం మిళితం అయిపోయింది.. ఆర్థిక సంస్కరణలు, సాంకేతిక సంస్కరణలు భారత ముఖ చిత్రాన్ని మార్చేశాయి.. అందులో నేను కూడా కీలక భాగస్వామిని కావటం నా అదృష్టం.. గతంలో లైటెనింగ్ కాల్ చేయాలన్నా 7 రోజులు పట్టేది.. అలాంటి సవాళ్లన్నీ దాటుకుని ఆధునిక సాంకేతిక యుగంలోకి అడుగుపెట్టాం.. ఇప్పుడు మొబైల్ ఫోన్ మన జీవితాల్లో ముఖ్యమైన భాగస్వామిగా మారిందన్నారు.యంగ్ ఇండియా మన దేశానికి ఉన్న అతిపెద్ద అడ్వాంటేజ్.. క్వాంటం వ్యాలీ డీప్ టెక్నాలజీ ఇప్పుడు సరికొత్త విప్లవం.. డీప్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో ఏపీకి కొన్ని సానుకూలతలు ఉన్నాయి. ఏపీలో స్పేస్ సిటీ, స్పేస్ టెక్నాలజీ, డిఫెన్స్, ఏరో స్పేస్






టెక్నాలజీలో చాలా అవకాశాలు ఉన్నాయి.. ఎలక్ట్రానిక్స్ రంగంలోనూ పుష్కలంగా ఉన్నాయి. డ్రోన్లు యుద్ధాలకు, పౌర సేవల కోసం ఉపయోగపడుతున్నాయి.. ప్రస్తుతం ఏపీలో ప్రభుత్వ సేవలను వాట్సప్ ద్వారా అందిస్తున్నాం.. ఆగస్టు 15 నుంచి వంద శాతం పౌరసేవలు వాట్సప్ ద్వారానే అందిస్తామని తెలిపారు. 2026 జనవరి 1 నుంచి అమరావతి క్వాంటం వ్యాలీ పార్క్ పనిచేయటం ప్రారంభం అవుతుంది.. ఒక ఎకోసిస్టం కూడా ఏర్పాటు అవుతుంది. వంద యూజ్ కేసెస్ కూడా పరీక్షిస్తాం.. ఇతర దేశాలతో పోలిస్తే ఏఐ వినియోగం భారత్ లోనే ఎక్కువ ఉంటుంది.. డేటా లేక్ పై ఏపీ ప్రస్తుతం పనిచేస్తోంది. జియో ట్యాగింగ్, సర్వీస్ డెలివరీ, ఆన్ లైన్్ ÷ల్స్, క్లౌడ్ డేటా ద్వారా పాలన జరుగుతోంది.. రియల్ టైమ్ డేటా కూడా అందుబాటులోకి వచ్చింది. సీసీ కెమెరాలు, సెన్సార్లు, వేరబుల్స్ ద్వారా సమాచారం వస్తోంది. వీటిని విశ్లేషించాలంటే క్వాంటం కంప్యూటింగ్ అవసరం.. 42 పారామీటర్ల సమాచారాన్ని కూడా సేకరించి విశ్లేషించే అవకాశం ఉటుంది. సాయిల్ మాయిశ్చర్ లాంటి అంశాలను క్వాంటం కంప్యూటింగ్ తో అనుసంధానిస్తే అద్భుతాలు చేయొచ్చు.. ఈ రంగాల్లో స్టార్టప్ లు కూడా వస్తే విస్తృతమైన అవకాశాలు ఉంటాయి.. ఫార్మా రంగంలోనూ విశేషమైన పరిశోధనలు సాగించవచ్చు.. భారత్– యూఎస్ అతిపెద్ద ప్రజా స్వామ్యాలు సుదీర్ఘకాలం పాటు కలసి పనిచేస్తాయి.. సాఫ్ట్‌వేర్ లో భారత్ బలంగా ఉన్నా ఉత్పత్తుల విషయంలో చాలా బలహీనంగా ఉన్నాం.. ఓ మిషన్ తీసుకువచ్చి అమరావతికి క్వాంటం కంప్యూటర్ వచ్చేసింది అనుకోవటం లేదు.. ఈ రంగంలో ఓ ఎకో సిస్టంను తీర్చిదిద్దుదాం.. యుద్ధానికి మనుషుల్ని పంపించటం పాత విషయం అయిపోయిందన్నారు. ఇప్పుడు అంతా సాంకేతిక యుద్ధమే.. ఐక్య రాజ్య సమితి క్వాంటం కంప్యూటింగ్ సంవత్సరంగా ప్రకటించింది.. క్వాంటం శాటిలైట్ అందుబాటు లోకి వస్తే మనకు ఎంతో లబ్ది చేకూరుతుంది.. సాధారణ పౌరుడి వరకూ కంప్యూటర్ సాంకేతికతను తీసుకెళ్లేలా గతంలో ప్రయత్నాలు చేశాం.. అందుకే చాలా మంది ఐటీ నిపుణులు ఇక్కడి నుంచి తయారయ్యారు.. గతంలో ఐటీ మంత్రులు కేవలం గ్రాడ్యుయేట్లు మాత్రమే ఉండేవారు.. ఇప్పుడు ఐటీ మంత్రిగా కార్నెగీ
మెలన్ యూనివర్సిటీలో చదివిన లోకేష్ ఉన్నారు.. ఆయనకు ఓ విజన్ ఇస్తున్నా క్వాంటం వ్యాలీ ద్వారా వాటిని సాధించాలి.. ఈ మూమెంటంలో అంతా భాగస్వాములు కావాలని అన్ని బహుళజాతి సంస్థలకూ పిలుపును ఇస్తున్నానన్నారు. ఇప్పుడే పెట్టుబడులతో ముందుకు రావాలని కోరుతున్నాను.. భారత్ లో ఉత్పత్తిని తయారు చేసి ఇక్కడి మార్కెట్ నే వాడుకోండి.. ఇన్నోవేషన్ కు ఆకాశమే హద్దు.. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్.. అమరావతితో పాటు ఐదు ప్రాంతాల్లో ఈ తరహా హబ్ లను ఏర్పాటు చేశాం.. వాటిని వినియోగించుకోవాలని పరిశ్రమలను, స్టార్టప్ లను కోరుతున్నా.. వన్ ఫ్యామిలీ, వన్ ఎంటర్ ప్రెన్యూర్ ను తయారు చేయాలని లక్ష్యం ఇచ్చాం.. క్వాంటం కంప్యూటింగ్ సాంకేతికతను మరో స్థాయికి చేరుస్తుంది.. నేను నిత్యవిద్యార్థిని.. భవిష్యత్ సాంకేతికతను పాలనలో ఎలా సమ్మిళితం చేయాలన్నదే నా లక్ష్యం.. కేంద్ర సహకారంతో అన్ని లక్ష్యాలనూ సాధిస్తామని తెలిపారు. అమరావతికి అనేక ఐటీ సంస్థలు వస్తున్నాయని మంత్రి నారా లోకేశ్ అన్నారు. విజయవాడలో క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీపై నిర్వహించిన నేషనల్ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. అధునాతన సాంకేతిక కేంద్రంగా అమరావతిని మారుస్తామన్నారు. క్వాంటమ్ టెక్నాలజీపై మరింత దృష్టి పెడుతున్నామని చెప్పారు. అమరావతికి రావాలని స్టార్టప్ సంస్థలను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు విజనరీ లీడర్‌షిప్ గురించి అందరికీ తెలుసని.. ఆయన ఎప్పుడూ సాంకేతికతకు పెద్దపీట వేస్తారని పేర్కొన్నారు. వర్క్‌షాప్‌నకు వచ్చిన ఐటీ, ఎంఎన్‌సీ కంపెనీల ప్రతినిధులకు లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

## పాశమైలారం కెమికల్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు

**సంగారెడ్డిజూన్ 30 ఆంధ్ర ప్రగతి**

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు సమీపంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో ఉన్న సీగాచి కెమికల్స్ పరిశ్రమలో సోమవారం ఉదయం ఘోర ప్రమాదం సంభవించింది. రియాక్టర్ ఒక్కసారిగా పేలిపోవడంతో భారీ పేలుడు సంభవించడంతో పరిశ్రమ తునాతునకలైపోయింది. ఈ ఘటనలో ఇప్పటివరకు 10 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఉదయం 9 గంటల సమయంలో సీగాచి కెమికల్స్‌లో పని సాగుతున్న సమయంలో రియాక్టర్ ఒక్కసారిగా పేలిపోవడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. పేలుడు ధాటికి కంపెనీ షెడ్డు పూర్తిగా కూలిపోయింది. మంటలు తక్కువ సమయంలోనే పరిశ్రమ మొత్తం వ్యాపించడంతో కార్మికులు బయటకు పరుగులు పెట్టారు. అయినప్పటికీ, పలువురు కార్మికులు మంటల్లో చిక్కుకుపోయారు. ఈ ప్రమాదంలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో ఐదుగురు కార్మికులు మంటల్లో సజీవదహనమయ్యారు. మిగతా మృతుల మరణానికి తీవ్ర గాయాలు కారణమయ్యాయని తెలుస్తోంది. శిథిలాల కింద ఇంకా 15 మంది కార్మికులు చిక్కుకుపోయి ఉండొచ్చని అనుమానించడంవల్ల మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం కనిపిస్తోంది. గాయపడ్డ 38 మందిలో 20 మందిని చందానగర్ ప్రభుత్వాస్పత్రికి, మరో 18 మందిని ఇస్నాపూర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే 8 ఫైరింజన్లు ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపులోకి తేవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాయి. శిథిలాల తొలగింపునకు భారీ క్రేన్‌లు, హైడ్రా మిషన్‌లను రంగంలోకి దించారు. అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ పూర్తిగా కూలిపోవడంతో సహాయక బృందాలు శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు ప్రాణాపాయంగా శ్రమిస్తున్నారు. ఇప్పటి వరకు ఆ భవనం నుంచి కేవలం ఆరుగురినే బయటకు తీయగలిగారు. కెమికల్ ఫ్యాక్టరీలో మంటలతో పాటు భారీగా విషవాయువులు విడుదలవడంతో పరిసర ప్రాంతాల్లో ఘాటైన వాసనలు వ్యాపించాయి. స్థానికులు ఉక్కిరిబిక్కిరవుతూ తమ ఇళ్లలోకి చెదురుమదురుగా చేరుకున్నారు. అప్రమత్తమైన అధికారులు సంఘటనా స్థలానికి ఎవరూ రావొద్దని హెచ్చరించారు. ఈ పేలుడు ఘటన రాష్ట్రాన్ని దిగ్భ్రాం÷–రతికి గురిచేసింది. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటించారా లేదా అన్నదానిపై విచారణ కొనసాగుతోంది. శిథిలాల తొలగింపు తర్వాత అసలు ప్రమాద స్థాయి ఎంత పెద్దదో అర్థం కానుంది. పేలుడు తీవ్రతకు ఉత్పత్తి విభాగం ఉన్న భవనం కూలిపోగా.. మరో భవనానికి బీటలు వచ్చాయి. పరిశ్రమ లోపల మరికొందరు చిక్కుకున్నట్లు సమాచారం. కార్మికుల్లో పలువురు ఫోన్లు పనిచేయకపోవడంతో వారి కుటుంబసభ్యుల్లో ఆందోళన నెలకొంది. చికిత్స పొందుతున్న వారిలో మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనాస్థలాన్ని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పరిశీలించారు. సహాయక చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. పరిశ్రమ నుంచి ఘాటైన వాసనలు వెలువడుతున్నాయి. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రియాక్టర్ పేలడంతో ఈ ప్రమాదం జరిగి పరిశ్రమలో మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. ఈ ప్రమాదంతో స్థానికులు, కార్మికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వారిని అక్కడి నుంచి దూరంగా పంపించివేసారు. పోలీసులకు సమాచారం తెలియడంతో సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులతో పాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. సంఘటన స్థలానికి పఠాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, మల్టీజోన్ టు ఐజీ సత్యనారాయణ, ఎస్పీ పరితోష్ పంకజ్ చేరుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## నేటి నుంచి పెరిగిన రైల్వే ఛార్జీల అమలు

**న్యూఢిల్లీ,జూన్ 30 ఆంధ్ర ప్రగతి:**కొత్త రైల్వే ఛార్జీలు, టికెట్‌బుకింగ్‌లో నిబంధనల అమలుపై రైల్వేబోర్డు కీలక ఆదేశాలు జారీ చేసింది. సోమవారం అర్ధరాత్రి నుంచి కొత్త రైల్వే ఛార్జీలు, టికెట్ బుకింగ్‌లు అమలులోకి వస్తాయని తెలిపింది. జూలై 1నుంచి ఈ మార్పులు అమలు కానున్నాయని ఇప్పటికే ప్రకటించింది. తత్కాల్ టికెట్ల బుకింగ్‌కు ఆధార్‌ను తప్పనిసరి చేసిన రైల్వేశాఖ..జులై 1 నుంచి అమలులోకి తీసుకుని రావాలంటూ అన్ని జోన్‌ల మేనేజర్లకు సర్క్యులర్ జారీ చేసింది. దీంతో అర్ధరాత్రి 12గంటల నుంచి పెంచిన రైల్వే ఛార్జీలు అమలులోకి రానున్నాయి. సెకండ్ క్లాస్ ఆర్డినరీకి 500కి.మీ వరకు సాధారణ ఛార్జీలే ఉండనున్నాయి. 501 కి.మీ నుంచి 1500 కి.మీ వరకు టికెట్‌పై రూ.5; 201 కి.మీ నుంచి 2500 కి.మీ వరకు టికెట్‌పై రూ.10; 2501 నుంచి 3వేల కి.మీ వరకు టికెట్‌పై రూ.15 చొప్పున పెంచారు. ఆర్డినరీ స్లీపర్ క్లాస్, ఫస్ట్ క్లాస్ ఆర్డినరీ టికెట్లపై కి.మీకు అరపైసా చొప్పున పెంచగా.. మెయిల్/ఎక్స్‌ప్రెస్ (నాన్ ఏసీ) రైళ్లలో టికెట్లపై నాన్ ఏసీ ఫస్ట్, సెకండ్ క్లాస్, స్లీపర్ క్లాస్ టికెట్లపై కి.మీకు ఒక పైసా చొప్పున పెంచారు. అలాగే, అన్ని రకాల రైళ్లలో ఏసీ అన్ని తరగతులకు కి.మీకు 2పైసలు చొప్పున పెంచుతున్నట్లు రైల్వేశాఖ తెలిపింది. రిజర్వేషన్ ఛార్జ్, సూపర్‌ఫాస్ట్ సర్‌ఛార్జీల్లో మాత్రం మార్పు ఉండదని స్పష్టం చేసింది. ఇప్పటికే రిజర్వేషన్ చేసిన టికెట్లకు పెంచిన ఛార్జీలు అమలు కావని తెలిపింది.

## బనకచర్లకు అనుమతులు ఇవ్వలేం

(మొదటి పేజీ తరువాయి)

తీర్పునకు విరుద్ధంగా ఈ ప్రాజెక్టు నిర్మిస్తున్నారని అభిప్రాయ పడింది. ఈ ప్రాజెక్టులో నీటి నిల్వపై కేంద్రంతో అధ్యయనం, రెండు రాష్ట్రాలకు సంబంధించిన అంశాలకు అన్ని అనుమతులు, పర్యావరణ ప్రభావంపై అంచనా వేసిన తర్వాతే ప్రాజెక్టుకు పూర్తిస్థాయి అనుమతివ్వడానికి సాధ్యమవుతుందని నిపుణుల కమిటీ తేల్చి చెప్పింది. ఈ మేరకు బనకచర్ల ప్రాజెక్ట్ కోసం ఆంధ్రప్రదేశ్ పంపిన ప్రతిపాదనలను తిప్పిపంపింది. బనకచర్ల ప్రాజెక్ట్‌కు అనుమతులు ఇవ్వాలంటే సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) పరిశీలించాల్సి ఉందని.. ఈ మేరకు సీడబ్ల్యూసీని అప్రోచ్ కావాలని ఏపీకి సూచించింది. సీడబ్ల్యూసీతో కలిసి ఫ్లడ్ వాటర్ అవేలబులిటి అస్సెస్ చేయాలని పేర్కొంది. అంతరాష్ట్ర జల వివాదానికి క్లియరెన్స్ తెచ్చుకోవాలని ఆంధ్రప్రదేశ్‌కు సూచించింది. కాగా, ఏపీ ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్రానికి చాలా ఫిర్యాదులు అందాయి. ఈ ప్రాజెక్టును మొదటి నుంచి తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. బనకచర్ల ప్రాజెక్ట్ వల్ల తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందని.. వెంటనే ఈ ప్రాజెక్టును ఆపాలని కేంద్రానికి ఫిర్యాదులు చేసింది. ఈ క్రమంలో బనకచర్ల ప్రాజెక్ట్ కోసం ఏపీ పంపిన ప్రతిపా దనలను కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ పరిశీలించింది. బనకచర్ల ప్రాజెక్ట్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేసిన కమిటీ.. అనుమతులు ఇవ్వడానికి తిరస్కరించింది. బనకచర్ల ప్రాజెక్ట్‌కు పర్యావరణ అనుమతులు ఇవ్వాలంటే గోదావరి ట్రిబ్యూనల్ తీర్పు పరిశీలించాల్సి ఉందని స్పష్టం చేసింది. ప్రాజెక్ట్ పర్యావరణ అనుమతుల కోసం సీడబ్ల్యూసీని సంప్రదించడం తప్పనిసరని పేర్కొంది. బనకచర్ల ప్రాజెక్ట్ గోదావరి ట్రిబ్యునల్ తీర్పునకు వ్యతిరే కమంటూ అనేక ఫిర్యాదులు వచ్చాయని కమిటీ వెల్లడించింది.

## చెవిరెడ్డికి మూడు రోజుల కస్టడీ

**జూన్ 30 ఆంధ్ర ప్రగతి**

మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి విజయవాడ ఏసీబీ కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో మరింత లోతైన విచారణ కోసం ఆయన్ను మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ న్యాయస్థానం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు ఇదే కేసులో నిందితుడిగా ఉన్న ఆయన కుమారుడు మోహిత్ రెడ్డి దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది.మద్యం కేసులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో పాటు మరో నిందితుడు వెంకటేశ్ నాయుడుని మూడు రోజుల పాటు విచారించేందుకు పోలీసులకు ఏసీబీ కోర్టు అనుమతినిచ్చింది. జులై 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య వీరిని పోలీసులు ప్రశ్నించనున్నారు. ఇటీవల సిట్ అధికారులు వీరిద్దరినీ అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం జులై 1 వరకు రిమాండ్ విధించిన సంగతి తెలిసిందే. ఆ గడువు ముగియనుండటంతో పోలీసులు కస్టడీ కోరుతూ పిటిషన్ దాఖలు చేయగా కోర్టు అంగీకరించింది.మరోవైపు ఈ కేసులో 39వ నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు మోహిత్ రెడ్డి, తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను ఏసీబీ కోర్టు తిరస్కరించింది. తండ్రికి పోలీస్ కస్టడీ ఖరారవడం, కుమారుడికి బెయిల్ నిరాకరణ కావడంతో ఈ కేసులో చెవిరెడ్డి కుటుంబానికి న్యాయస్థానంలో ఊరట లభించలేదు. సిట్ అధికారుల కస్టడీలో విచారణ పూర్తయితే ఈ కేసులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.



## బీజేపీకి రాజాసింగ్ రాజీనామా

**హైదరాబాద్,జూన్ 30 ఆంధ్ర ప్రగతి:**తెలంగాణ బీజేపీ పార్టీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పార్టీకి రాజీనామా చేశారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగుతున్న సమయంలోనే ఆయన ఈ నిర్ణయం తీసుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పార్టీ నాయకత్వంపై తీవ్ర ఆరోపణలు చేసిన ఆయన, ఇకపై బీజేపీలో కొనసాగలేనని స్పష్టం చేశారు.వివరాల్లోకి వెళితే, రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవి ఎన్నికల్లో పోటీ చేసేందుకు రాజాసింగ్ ఈ మధ్యాహ్నం తన మద్దతుదారులతో కలిసి నాంపల్లిలోని పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ క్రమంలో తన అనుచరులను కొందరు నేతలు బెదిరించారని ఆయన ఆరోపించారు. ఈ పరిణామంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన రాజీనామా లేఖను కేంద్ర మంత్రి, ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి పంపినట్లు తెలిపారు.ఈ సందర్భంగా రాజాసింగ్ పార్టీ అధిష్టానంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం కేంద్రంలోని పెద్దలకు ఇష్టం లేదు. అందుకే ఇలాంటి పరిస్థితులు సృష్టిస్తున్నారు. అధ్యక్షుడిని ముందే నిర్ణయించుకుని, ఎన్నికల పేరుతో నాటకాలు ఆడుతున్నారు" అని ఆయన ఆరోపించారు. 2019 నుంచి పార్టీ కోసం ఎన్నో కష్టాలు పడ్డానని, పార్టీ కోసమే తాను ఉగ్రవాదులకు టార్గెట్ గా మారానని ఆవేదన వ్యక్తం చేశారు.

## 8రోజులు,5దేశాల్లో !

**జులై 2 నుంచి 9 వరకు ప్రధాని మోదీ 8 రోజుల విదేశీ పర్యటన**

**జూన్ 30 ఆంధ్ర ప్రగతి**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరో విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. జులై 2వ తేదీ నుంచి ఎనిమిది రోజుల పాటు రెండు ఖండాల్లోని ఐదు దేశాల్లో ఆయన పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియాలను సందర్శిస్తారు. బ్రెజిల్‌లో జరిగే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనడంతో పాటు, గ్లోబల్ సౌత్‌లోని కీలక దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్ఠం చేసుకోవడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది.విదేశాంగ శాఖ ఆర్థిక సంబంధాల కార్యదర్శి దమ్ము రవి తెలిపిన వివరాల ప్రకారం, ప్రధాని మోదీ తన పర్యటనను జులై 2న ఆఫ్రికా దేశం ఘనాతో ప్రారంభిస్తారు. జులై 3 వరకు అక్కడే ఉంటారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఒక భారత ప్రధాని ఘనాలో పర్యటించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఘనా అధ్యక్షుడితో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఆర్థికం, ఇంధనం, రక్షణ రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవడంపై చర్చిస్తారు. అనంతరం జులై 3, 4 తేదీల్లో కరేబియన్ దేశమైన ట్రినిడాడ్ అండ్ టొబాగోలో పర్యటిస్తారు. 1999 తర్వాత ఈ దేశంలో భారత ప్రధాని పర్యటించడం కూడా ఇదే ప్రథమం.

# ప్రజా సమస్యలను నాణ్యతతో పరిష్కరించండి.

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్, 30:**
ప్రజా సమస్యలను నాణ్యతతో మెరుగైన రీతిలో పరిష్కరించేలా బాధ్యతగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి అర్జీలను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... పి జి ఆర్ ఎస్ దరఖాస్తులను ఎలాంటి నిర్లక్ష్యం చూపకుండా నిర్ణీత కాల పరిమితి లోపు నాణ్యతగా పరిష్కరించాలన్నారు. అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్మెంట్ ను కూడా వారికి అర్థమయ్యే రీతిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా అర్జీలను పరిష్కరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక వచ్చే దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా వీల్ చైర్, ర్యాంపు ఏర్పాటు చేయాలని డిఆర్ఓ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా అధికారులు జరిపే ఉత్తర, ప్రత్యుత్తరాలు కేవలం ఈ ఆఫీస్ ద్వారానే పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. పి4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్షిప్) సర్వేలో భాగంగా జిల్లాలో బంగారు కుటుంబాలకు చేయూతను ఇచ్చేందుకు మార్గదర్శులుగా నమోదయ్యే వారికి పూర్తి అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో



గుర్తించిన 42వేల మంది బంగారు కుటుంబాలు, 2800 చెంచు కుటుంబాలు ఉన్నాయని వారికి అవసరమైన సహాయ సహకారాలు అందజేయాలన్నారు. అదే విధంగా జిల్లా అధికారులు కూడా స్వచ్ఛందంగా మార్గదర్శకులుగా నమోదై బంగారు కుటుంబాలకు చేయూతను అందజేయాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో అన్ని పాఠశాలలు, కళాశాలలో పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని గిరిజన, బిసి, ఎస్సీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా బీసీ సంక్షేమ వసతి గృహాల్లో బాత్రూమ్స్, మరుగుదొడ్ల నిర్వహణ సరిగ్గా లేకపోవడం వల్ల ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా స్పెషల్ ఆఫీసర్లు నిత్యం వసతి గృహాలను తనిఖీ చేస్తూ ఉండాలన్నారు. జూలై 1వ తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ సందర్భంగా అందుకు తగిన మొత్తాన్ని బ్యాంకుల నుండి ఉపసంహరణ చేసుకొని పెన్షన్ పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓలను కలెక్టర్ ఆదేశించారు.

**పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని దరఖాస్తులు1.** అవుకు మండలం మంగంపేట తాండకు చెందిన తిరుపతి నాయక్... తన కుమార్తె కె.భారతి పాణ్యం గవర్నమెంట్ ఎస్టి హాస్టల్ హై స్కూల్లో 4వ తరగతి వరకు చదువుకుదని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం ఎంట్రెన్స్ ఎగ్జామ్ లో తిరుపతి జిల్లాలో సూళ్లరు పేటలో సీటు వచ్చిందని తెలిపి ఉన్నారు.. తర్వాత ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. దయతో నా కూతురికి గురుకులం హాస్టల్లో సీటు ఇప్పించగలరని కలెక్టరుకు దరఖాస్తు సమర్పించుకున్నారు. 2. బేతంచర్ల మండలం గోరుమానుకొండ గ్రామం వాస్తవ్యుడు కె.బాలయ్య.. సర్వేనెంబర్ నందు 714-4లో 2.04 ఎకరాల విస్తీర్ణం 1964 రిజిస్టర్ అయినది. దయతో పైన తెలిపిన సర్వే నంబర్లు ఆన్లైన్లో నమోదు చేయగలరని దరఖాస్తును సమర్పించారు.ఇంకా ఈ కార్యక్రమంలో 284 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నింటినీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో డెంగ్యూ మాసోత్సవాలను విజయవంతం చేయండి.

**డ్రైడే-ఫ్రైడే ను పటిష్టంగా అమలు చేయాలి.**

**జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్, 30:**జిల్లాలో జూలై 1 నుంచి డెంగ్యూ మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించి డెంగ్యూ నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో డెంగ్యూ మాసోత్సవాలకు సంబంధించిన ప్రచార కరపత్రాలను జెసి, వైద్యాధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జూలై నెలలో జాతీయ డెంగ్యూ మాస ఉత్సవాలను నిర్వహించాలని ఆదేశించిందన్నారు. ఇందుకు ప్రభుత్వం మూడు పద్ధతులను పాటించాలని సూచించిందని చెప్పారు.. డెంగ్యూను ఓడించడం, నీటిని పరిశీలించడం, శుభ్రం చేయడం, మూతల పెట్టడం తప్పనిసరిగా పాటించాలన్నారు. అలాగే మలేరియా నివారణకు కూడా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రజలు ఆరోగ్యంగా ఆనందంగా జీవించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2047 విజన్ ప్రణాళికలతో ముందుకు వెళ్తోందని... డెంగ్యూ, మలేరియాలను నివారించి ప్రజల ఆరోగ్య సంరక్షణకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెసి సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, డిఎంహెచ్ఓ వెంకటరమణ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రెవిన్యూ శాఖలో హరినాధరావు సేవలు మరువలేనివి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 30:**
రెవిన్యూ శాఖలో సుదీర్ఘకాలం పాటు పనిచేసిన హరినాధరావు సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, జేసి సి విష్ణు చరణ్ లు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని భూ విభాగం సూపరింటెండెంట్ హరినాధరావు పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కలెక్టరు, జేసి, డిఆర్ఓ, ఆర్డీవోలు, కలెక్టర్ వివిధ విభాగాల సూపరింటెండెంట్ లు, సిబ్బంది తదితరులు పాల్గొని ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రెవిన్యూ శాఖకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ప్రజాస్వామ్య విలువలను కాపాడిన యోధులను స్మరించుకునేందుకే రాజ్యాంగ హత్య దినం.

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 30:**
ఎమర్జెన్సీ సమయంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడిన యోధులను స్మరించుకునేందుకే రాజ్యాంగ హత్య దినం జరుపుకుంటున్నామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం నంద్యాల కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో జిల్లా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ జి.రాజకుమారి అధ్యక్షతన.. స్వతంత్ర భారత చరిత్రలో అత్యవసర పరిస్థితి విధించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా.. రాజ్యాంగ హత్య దినం (సంవిధాన్ హత్య దివస్) 2025 పై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 1975 జూన్ 25 న ఎమర్జెన్సీ విధించిన సమయంలో బాధిత కుటుంబ సభ్యుడు నంద్యాలకు చెందిన సత్యనారాయణ మాట్లాడుతూ... ఎమర్జెన్సీ సమయంలో ప్రజల ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారని వాటికి ప్రత్యక్ష సాక్షులు తమ కుటుంబమేనని పేర్కొన్నారు. మాట్లాడే స్వేచ్ఛను కోల్పోవడమే కాకుండా అనేక ఆంక్షలతో తన కుటుంబ పెద్దలు పలు ఇబ్బందులకు గురి అయ్యారని వాటన్నిటిని ఎదుర్కొని దేశసేవ చేయగలిగారని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ....దేశవ్యాప్తంగా




1975 జూన్ 25న ఎమర్జెన్సీ విధించిన నేపథ్యంలో భారత ప్రభుత్వం ఆ రోజును రాజ్యాంగ హత్యాదినంగా ప్రకటించిందన్నారు. దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ విధించి 2025 జూన్ 25 నాటికి 50 సంవత్సరాలు నిండిన సందర్భంగా రాజ్యాంగము మరియు దాని విలువలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 2026 జూన్ 25 వరకు సంవత్సరకాలం జిల్లాలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కూడా రాజ్యాంగ హత్య దివస్ ను జరుపుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం రాజ్యాంగ విలువలను ప్రజలకు తెలియజేసేందుకు మరియు విలువలను కాపాడుకోవడంలో ప్రజలందరూ వారికి ఇచ్చిన పాత్ర పోషించాలన్నారు. సంవిధాన్ హత్య దివస్ మనకు చరిత్రను గుర్తు చేయడమే కాకుండా భవిష్యత్ తరాలకు ఇది ఒక బోధనగా నిలుస్తుంది అన్నారు. అంతేకాక ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయవలసిన బాధ్యతను కూడా గుర్తు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆనాటి ఎమర్జెన్సీకి దారి తీసిన సంఘటనలు, అనంతర పరిస్థితులను కలెక్టర్ కళ్లకు కట్టినట్టుగా వివరించారు. దేశంలో ఎమర్జెన్సీ కాలంనాటి చరిత్రపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో జేసి సి.విష్ణు చరణ్, డిఆర్ఓ రాము నాయక్, జిల్లా పర్యాటకశాఖ అధికారి సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన రైతులను ఆదుకోండి.

**ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్.**

**పోడు వ్యవసాయ భూములపై సర్వ హక్కులు కల్పించి, పట్టాలు మంజూరు చేయాలి.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 30:**
పోడు వ్యవసాయ భూములపై సర్వహక్కులు కల్పించి పట్టాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు రాజు నాయక్ ప్రభుత్వ అధికారులను కోరారు.సోమవారం నంద్యాల పట్టణంలోని క్రాంతి నగర్ లో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం ఎదుట జిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ ఆధ్వర్యంలో అలేబా తాండ గ్రామ రైతులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వినతి పత్రాన్ని అందజేశారుఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ.. 1941 సంవత్సరం నుండి దాదాపు 130 గిరిజన కుటుంబాలు పోడు వ్యవసాయం భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు అయితే గత ప్రభుత్వంలో వీళ్లకు అటవీ హక్కుల చట్టం కింద (ఆర్ ఓ ఎఫ్ ఆర్) పథకం కింద పోడు వ్యవసాయ భూమిని కేటాయించారు అయితే సాగు చేసుకుంటున్న భూములపై ఎలాంటి సర్వే చేయకుండా ఆన్లైన్లో ఎక్కించకుండా పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయకుండా అధికార యంత్రాంగం నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. తమ సాగు చేసుకుంటున్న భూములపై పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని ఏళ్ల తరబడి గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న ఏమాత్రం అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఆన్లైన్లో లేకపోవడం వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అన్నదాత సుఖీభవ, సబ్సిడీ రాయితీ రుణాలు లాంటి ఎన్నో పథకాలు నోచుకోలేకపోతున్నామన్నారు. ఆ భూములపైనే ఆధారపడి వారి కుటుంబాలు నివసిస్తున్నారని, వారికి జీవనాధారం ఆ భూములేనని గుర్తు చేశారు. ఇప్పటికైనా గిరిజన శాఖ అధికారులు, ఐటిడిఏ అధికారులు చొరవ తీసుకొని గిరిజన రైతు కుటుంబాలకు పక్కా పట్టా మంజూరు చేసి వారి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అలేబా తండా రైతులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు రిలే నిరహార దీక్షకు సంఘీభావం తెలిపిన శిల్పా నాగిని రవి సింగారెడ్డి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 30:** రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ అన్ని మున్సిపాలిటీల పరిదిలో సమ్మె చేపడుతున్నారు. ఇందులో భాగంగా నంద్యాల మున్సిపాలిటీ ఎదురుగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి సతీమణి వైసీపీ నేత నాగిని రవి సింగారెడ్డి మరియు వైసీపీ మహిళా కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు కలిసి సమ్మె చేస్తున్న ఇంజినీరింగ్ వర్కర్ లకు సంఘీభావం తెలిపారు. అనంతరం నాగిని రవి సింగారెడ్డి మాట్లాడుతూ...మున్సిపాలిటే అభివృద్ధిలో పారిశుధ్య , ఇంజనీరింగ్ వర్కర్ల ప్రాముఖ్యత ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఇంజనీరింగ్ వర్కర్ల న్యాయమైన డిమాండ్ లను వెంటనే పరిష్కారం చేయాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మున్సిపల్ కార్మికుల పట్ల చిత్తశుద్ధితో పని చేశారని వారి జీతభత్యాలు పెంపు చేయడం జరిగిందన్నారు. ఇంజనీరింగ్ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కారం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.




# గ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రమం పటిష్టంగా నిర్వహించాలి.

**కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలపై అవగాహన అవసరం.**

**2014లో తెరిచిన జనధన్ ఖాతాల రీ-కెవైసి తప్పనిసరి. -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్, 30:**
జులై 1వ తేది నుండి సెప్టెంబరు 30వ తేది వరకు గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించి కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం గ్రామస్థాయి జన సురక్ష, కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమం ద్వారా జూలై 1వ తేది నుండి సెప్టెంబరు 30వ తేది వరకు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజనలపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని డిఆర్డిఏ, డిఎల్డిఓ, డిపిఓలను కలెక్టర్ ఆదేశించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన క్రింద వయోపరిమితి 18 నుండి 70 సంవత్సరాల లోపు వారు వార్షిక ప్రీమియం రూ.20/-చెల్లించాలన్నారు. ఇందుకు ప్రమాద బీమాగా రెండు లక్షలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన క్రింద 18 నుండి 50




సంవత్సరాల లోపు వారు వార్షిక ప్రీమియం రూ.436 చెల్లిస్తే వారికి కూడా రెండు లక్షల రూపాయలు ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. అలాగే అటల్ పెన్షన్ యోజన లో భాగంగా నెల నెల కొంత సొమ్మును బ్యాంకు ఖాతాలో జమ చేసుకున్న ఎడల 60 సంవత్సరాల తర్వాత పెన్షన్ రూపంలో ఖాతాదారునికి అందజేయడం జరుగుతుందన్నారు. 2014 సం.లో బ్యాంకులలో తెరిచిన జనధన్ ఖాతాలకు సంబంధించి 2026 జూన్ 30తేదిలోగా రీ-కెవైసి చేయించుకునేలా ఖాతాదారులకు అవగాహన కల్పించాలన్నారు. అందుకు ఆధార్ కార్డు, ప్రస్తుత ఫోటో అందజేయాలన్నారు. అదే విధంగా డిజిటల్ లావాదేవీల పైన కూడా ఖాతాదారులకు సరైన అవగాహన కల్పించాలని ఎల్డీఎంను కలెక్టర్ ఆదేశించారు. అంతేకాకుండా డిజిటల్ ఆర్థిక లావాదేవీలపై కూడా గ్రామీణ ప్రజలకు కూడా పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని మున్సిపల్ కమీషనర్, ఎంపిడిఓలను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, డిఆర్ఓ రాము నాయక్, ఎల్డిఎం రవీంద్ర కుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ ను ప్రధాని మోదీ గుండెల్లో పెట్టుకొని అభివృద్ధి చేస్తున్నారు.!

**ప్రతిపక్షం లేకుండా అవతరించనున్న బిజెపి.**

**దేశ అభివృద్ధి చూసి బిజెపి లో చేరుతున్న యువత.**

**ప్రజల గుండెల్లో నిలుస్తున్న ప్రధాని మోదీ.**

**నంద్యాల జిల్లాలో బిజెపి సత్తా చూపిస్తున్న బిజెపి జిల్లా అధ్యక్షులు.**

**బైరెడ్డి...గౌరు అడ్డా లో బిజెపి జండా రెపరెపలు.**

**జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాదక్ష్యులు శ్రీనివాస్ గౌడ్ బిజెపిలో చేరిక.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 30:** నంద్యాల జిల్లాలో కాంగ్రెస్, తెలుగుదేశం,వైసిపి పార్టీలే మనుగడలో ఉండేవి. దేశవ్యాప్తంగా బిజెపి పార్టీ అధికారంలో ఉన్నా ఆంధ్రప్రదేశ్ లో బిజెపి పార్టీ వెనుకంజలో ఉండేది. బిజెపి పెద్దలు ఆంధ్రప్రదేశ్లో సైతం బిజెపి పార్టీ బలోపేతం చేయడానికి ప్రణాళికలు రూపొందించారు. ఆంధ్రప్రదేశ అభివృద్ధికి ప్రధాని మోదీ సర్కార్ చేస్తున్న అభివృద్ధి మంచి ఫలితాలు సాధిస్తుంది. బిజెపి ప్రభుత్వంలో 11 ఏళ్ల పాలనపై ,అభివృద్ధిపై ప్రజలు ఆకర్షితులు అవుతున్నారు. ప్రపంచదేశాలు సైతం భారతదేశం వైపు చూసే విధంగా బిజెపి ప్రభుత్వం చేస్తుంది. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ లో గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలుపడంతో అక్కడక్కడ బిజెపి అభ్యర్థులు గెలుపొందారు. ఈ నేపథ్యంలోనే నంద్యాల జిల్లా లో బిజెపి పార్టీని బలోపేతం చేయడానికి కష్టపడే నాయకుడికోసం ఎదురుచూశారు. బిజెపి పార్టీలో ఉన్న అభిరుచి మధు పార్టీకోసం కష్టపడటాన్ని గ్రహించిన అధిష్టానం బిజెపి జిల్లా అధ్యక్ష పదవిని అభిరుచి మధుకు కట్టబెట్టింది. అధిష్టానం ఆయనపై నమ్మకం పెట్టడంతో జిల్లాలో బిజెపి పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు జిల్లా వ్యాప్తంగా ఎందరో మహా,మహా నేతలను పార్టీలో చేర్పించుకుంటున్నారు. జిల్లాలో నందికొట్కూరు అంటే అంటే బైరెడ్డి,గౌరు కుటుంబాలే రాజకీయంలో ఉండేవి. నందికొట్కూరు అద్దాలి అప్పట్లో కాంగ్రెస్,తెలుగుదేశం,వైసిపి పార్టీలే ఉండేవి. బిజెపి పార్టీ బలోపేతం చేయడానికి జిల్లా కాంగ్రెస్ ఉపాదక్ష్యులు శ్రీనివాస్ గౌడ్ బిజెపి పార్టీలో చేరడంతో నందికొట్కూరు బిజెపి జండా రెప,రెపలాడింది. నందికొట్కూరు కు నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు చేరుకోవడంతో భారీ ఘనస్వాగతం పలికారు. పురవీధుల్లో బైకు,కారు ర్యాలీ ఆటహాసంగా నిర్వహించారు. పూలవర్షం కురిపిస్తూ భారీ క్రేను తో గజాల వేసి అభిమానాన్ని చాటుకున్నారు. నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాదక్ష్యుడు శ్రీనివాస గౌడ్ తో పాటు సుమారు 300 మంది బిజెపి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో నంద్యాల జిల్లా బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆంధ్రప్రదేశ్ ను గుండెల్లో పెట్టుకొని అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో ప్రతిపక్షం లేకుండా బిజెపి పార్టీ అవతరించనుందనీ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని చేస్తున్న అభివృద్ధికి ప్రధానంగా యువత ఆకర్షిస్తుందని అన్నారు. నందికొట్కూరు లో శ్రీనివాస గౌడ్ చేరడం సంతోషంగా ఉందని అన్నారు. జిల్లా లోని అన్ని నియోజకవర్గాల్లో త్వరలో పెద్ద ఎత్తున బిజెపి పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. దేశంలో పేదలు, రైతులు,



మహిళలు,విద్యార్థుల ను దృష్టిలో పెట్టుకొని పలు సంక్షేమ పథకాలను అందిస్తున్నారని అన్నారు. హే వే నిర్మాణాలు చాలా,చక జరుగుతున్నాయని,నిరుద్యోగ సమస్య పరిష్కరించేందుకు భారీ పరిశ్రమలు పెట్టేందుకు భారత్ వైపు చూస్తున్నాయని అన్నారు. ఆపరేషన్ సిందూర్ తో అందరి హృదయాల్లో మోదీ నిలిచారన్నారు. ప్రపంచదేశాల్లో ఆర్థికపరంగా 4 వ స్థానానికి చేర్చిన ఘనత బిజెపి పార్టీకి దక్కిందన్నారు. బిజెపి పార్టీ తోనే దేశం అభివృద్ధి పయనంలో నడుస్తుందని అన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని బిజెపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.









# ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మైనర్ డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవ్.

**మైనర్ డ్రైవింగ్ చేస్తున్న 15 మంది మైనర్లకు 75,000/- జరిమాన.**

**ట్రాఫిక్ నిబంధనలు పాటించండి సురక్షితంగా గమ్యం చేరండి.**

**ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మల్లికార్జున గుప్తా.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల క్రైమ్ జూన్ 30: నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు నంద్యాల ఏ ఎస్ పి మంద.జావళి ఆల్ఫోన్స్ సూచనలతో నంద్యాల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మల్లికార్జున గుప్తా గారి ఆధ్వర్యంలో ఆదివారం నంద్యాల పట్టణంలో మైనర్ డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నంద్యాల పట్టణ కేంద్రంలోని శ్రీనివాస్ సెంటర్, సంజీవనగర్ గేట్ ,కోవెలకుంట్ల జంక్షన్, వై జంక్షన్, మున్సిపల్ ఆఫీస్, పద్మావతి నగర్ ,సిటీ బస్టాండ్, ఆత్మకూరు బస్టాండ్ గాంధీ చౌక్, బైర్మల్ వీధి మొదలగు ప్రాంతాలలో ముఖ్యమైన కూడళ్లలో నంద్యాల ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మైనర్ డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగింది ఈ స్పెషల్ డ్రైవ్ లో 15 మంది మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుపడగా వారి ఒక్కొక్కరికి 5000/- చొప్పున 75,000/- జరిమాన విదించడం జరిగింది, రోడ్డు ప్రమాదాల నివారించుటకు మరియు తల్లిదండ్రులు, యువతలో చట్టపరమైన అవగాహన కల్పించడం కొరకు ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ గారు మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత,ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా తమ ప్రాణాలను కాపాడుకోవాలని నంద్యాల పట్టణ కేంద్రంలో ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో (మోటార్ వాహన చట్టం నిబంధనలు) ఎం వి యాక్ట్ గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. 18 సంవత్సరాలు నిండిన వారికి మాత్రమే డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేయబడుతుందని,లైసెన్స్ లేకుండా వాహనం నడపడం చట్టరీత్యా నేరం, వాహనం నడిపిన మైనర్కు మరియు వాహనం ఇచ్చిన యజమాని లేదా అతని సంరక్షకుడిపై 5,000 వరకు జరిమానాతో పాటు 3 సంవత్సరాల జైలు శిక్ష విధించబడుతుంది. మైనర్లు అత్యుత్సాహంతో అతివేగంగా వాహనాలు నడపడం వలన రోడ్డు ప్రమాదాలకు గుర్కై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవడంతోపాటు, ప్రాణాలు కోల్పోతున్నారు. కావునప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తల్లిదండ్రులకు మరియు మైనర్లకు తెలియజేయడం జరిగింది. తల్లితండ్రులు తమ పిల్లలకు ట్రాఫిక్ రూల్స్ గురించి అవగాహన కల్పించడంతోపాటు మైనర్ డ్రైవింగ్ ను ఎట్టి పరిస్థితులలో ప్రోత్సహించరాదని ఏదైనా అనుకోని విధంగా ప్రమాదం జరిగితే కుటుంబాలలో తీరని నష్టం ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు.

# ఏపిజేయు యూనియన్ బలోపేతానికి కృషి చేస్తాం!

**-ఏపిజెయు జిల్లా కమిటీ అధ్యక్షుడు నందవరం శ్రీనివాసులు.**

**-నంద్యాల జిల్లా కేంద్రంలో ఏపిజెయు నూతన సభ్యత్వం నమోదు కార్యక్రమం.**

**జిల్లాలో అందరిని కలుపుకొని జర్నలిస్టుల హక్కుల పోరాటం చేస్తాం.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 30:** నంద్యాల జిల్లాలో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్ ను బలోపేతం చేస్తామని యూనియన్ జిల్లా కమిటీ అధ్యక్షులు నందవరం శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం నాడు జిల్లా కేంద్రంలో ఎపిజేయు యూనియన్ సభ్యత్వం నమోదు కార్యక్రమంలో భాగంగా నంద్యాల పట్టణంలోని కొందరి పాత్రికేయులకు ఏపిజేయు యూనియన్ ఆధ్వర్యంలో నూతన సభ్యత్వాలను అందజేయడం జరిగింది. ఈ సందర్బంగా జిల్లా కమిటీ అధ్యక్షుడు నందవరం శ్రీనివాసులు మాట్లాడుతూ,ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లాలో ఎపిజెయు యూనియన్ నూతన సభ్యత్వాలను నమోదు కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. జిల్లాలో జిల్లా కమిటీ అందరినీ కలుపుకొని జర్నలిస్టుల సంక్షేమానికి, హక్కుల కోసం పోరాటం చేస్తామని తెలిపారు. నంద్యాల జిల్లాలో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్తుల యూనియన్ ను బలోపేతం చేయడమే లక్ష్యంగా జిల్లా కమిటీ నాయకులు అందరం సమిష్టిగా కృషిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకులు సిఎం నాగేంద్ర, నరసింహ మూర్తి, నాగేశ్వర రెడ్డి, అబ్దుల్ మజీద్,రామారావు, శివ శంకర్, జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

# క్వాంటమ్ వ్యాలీకి స్వాగతం.

**ఆంధ్రప్రదేశ్ లో నూతన శకం ప్రారంభం.**

**ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 30:** క్వాంటమ్ వ్యాలీకి స్వాగతం పలుకుతున్నామని, ఆంధ్రప్రదేశ్లో నూతన శకం ప్రారంభమైనదని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

సోమవారం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ జనవరి 1-2026న భారతదేశపు మొట్టమొదటి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిలో కార్యకలాపాలను ప్రారంభిస్తుందని, ఇది ఆంధ్రప్రదేశ్లో క్వాంటం వ్యాలీ ఆఫ్ ఇండియా చారిత్రాత్మక ప్రారంభాన్ని సూచిస్తుందని ఆమె అన్నారు. దశాబ్దాలుగా కలలు కనే, ఖచ్చితత్వంతో లక్ష్యాలను సాధించే నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, అవిశ్రాంత నిబద్ధత వల్లనే ఈ దార్శనిక ముందడుగు సాధ్యమవుతుందని, సీఎంచంద్రబాబు నాయకత్వంలో, ఆంధ్రప్రదేశ్ కేవలం మౌలిక సదుపాయాలను నిర్మించడమే కాదనీ, భవిష్యత్తును కూడా నిర్మిస్తోందని, ఆవిష్కరణల యుగానికి స్వాగతం పలుకుతున్నామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

# పోలీస్ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి 160 ఫిర్యాదులు.

**విచారణ జరిపి ఫిర్యాదుదారులకు చట్ట పరిదిలో న్యాయం చేస్తాం. - జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల క్రైమ్ జూన్ 30:** నంద్యాల జిల్లా బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఫిర్యాదిదారుల నుంచి 160 ఫిర్యాదులను స్వీకరించారు.

ఈ సందర్భంగా ప్రజల ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని , ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని , నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సంబంధిత అధికారులతో చట్ట పరిధిలో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ ఫిర్యాదులలో కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేయడం, పొలం తగాదాలు, అన్నదమ్ముల ఆస్తి తగాదాలు మొదలగునవి ఉన్నాయి.

1) శిరివెళ్ల మండలం మహాదేవపురం గ్రామానికి చెందిన




బండి స్వామిదాస్, మహదేవపురం గ్రామ పొలిమేరలోని తన 5 ఎకరంల పొలముకు, రుద్రవరం మండలం కోటకొండ కొత్తూరు గ్రామానికి చెందిన పగిడి చంద్రపాల్ పొలంలో నుండి రస్తా ద్వారా గత 60 సంవత్సరముల నుంచి రాకపోకలు జరుపుతున్నామని, పగిడి చంద్రపాల్ ఈ సంవత్సరం నుండి నా పొలం గుండా వెళ్లడానికి వీలులేదు అని మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నాడని ఎస్పీ కి ఫిర్యాదు చేశారు.

2) పాణ్యం మండలం, తమ్మరాజు పల్లి గ్రామానికి చెందిన ఎం.పుల్లయ్య గురువయ్య అను రైతులకు 2024 లో బేయర్ కంపెనీకి చెందిన ఏజెంట్లు జగన్, శ్రీరాములు, వెంకటరమణ అనువారు మొక్కజొన్న సీడ్ విత్తనాలు ఇప్పించి పండిన తర్వాత క్వింటల్ కు 3500 ప్రకారం కొంటామని, నష్టం వస్తే ఎకరానికి 70000 నుండి 80000 రూపాయలు నష్టపరిహారం ఇస్తామని చెప్పి మా చేత పంట వేయించారు, పంట నష్టం వచ్చిందని నష్టపరిహారం ఇవ్వమని అడగగా ఈరోజు ఇస్తాం రేపు ఇస్తామని గత ఎనిమిది నెలల నుండి చెప్పుకుంటూ వస్తున్నారు కానీ ఇవ్వలేదు మమ్మల్ని మోసం చేసిన కంపెనీ పై తగు చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయగలరని ఎస్పీ కి పిర్యాదు చేసారు.

3)అనంతపురం జిల్లా తాడిపత్రి మండలానికి చెందిన దాసరి చిన్న రవి %వా/వా% జకరయ్య అను అతనికి

కొలిమిగుండ్ల మండలం, కంభవారిపల్లె గ్రామానికి చెందిన వడ్డే శంకర్ నారాయణ రైల్వేలో టిసి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి 14 లక్షల రూపాయలు డబ్బులు తీసుకుని, ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేశాడని, డబ్బులు ఇవ్వమంటే, ఇవ్వడం లేదని జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఏన్.యుగంధర్ బాబు పాల్గొన్నారు.

# ఉచిత చెవి,ముక్కు,గొంతు చర్మవ్యాధుల శిబిరం.!

**-రెండు రోజులు ఉచిత వినికిడి వైద్య చికిత్సా శిబిరం.**

**-చెవిటి మిషన్ల కొనుగోలుపై 30 శాతం డిస్కౌంట్.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 30:** నంద్యాల పట్టణంలోని తిరుమల పునీత్ ఆసుపత్రిలో ఉచిత ,చెవి,ముక్కు,గొంతు,చర్మ వ్యాధుల వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు వైద్యులు హరిత,అనిల్ కుమార్ లు పేర్కొన్నారు. సంజీవనగర్ గేట్ సమీపంలోని తిరుమల పునీత్ ఆసుపత్రిలో రేపు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు వారు మీడియా సమావేశంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేస్తున్నామని అన్నారు. ఈ శిబిరంలో చెవిలో చీము కారి,వినికిడి సమస్యలు,ముక్కు దిబ్బడ,దూలం వంకర,సైనసైటిస్,తుమ్ములు,ముక్కులో నీరు కా రుట,ముక్కులో కోసులు,కండలు,గలిగేలు,గొంతుసమస్యలు, లేజర్ హెయిర్ రిమూవర్,డెరమరోరల్ ఫింపుల్ స్కార్,పులిపిర్లు,ముఖం పై గుంతలు,తెల్ల పొడ లు,అవాంచిత రోమాలు లేజర్ పద్ధతి ద్వారా తొలగించుట తో పాటు రెండురోజులు వినికిడి పరీక్షలు,3 సంవత్సరాలు లోపు పిల్లలకు మాటలు రానివారికి స్పీచ్ థెరపీ పరీక్షలు అనంతరం చెవిటి మిషన్ అవసరం అయినవారికి 30 శాతం డిస్కౌంట్ ఆఫర్ సౌకర్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పట్టణ,గ్రామీణ ప్రాంత వసూలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



తిరుమల పునీత్ ఆసుపత్రి వైద్యులు అనిల్ కుమార్.

# టీడీపీ కోసం నిస్వార్థంగా పనిచేసిన ప్రతి కార్యకర్తను పార్టీ న్యాయం చేస్తుంది.

**-నంద్యాల జిల్లా నీటి సంఘం చైర్మన్ చాబోలు ఇలియాస్.**

**టీడీపీ విధేయతకు నిలువెత్తు ప్రతిరూపం ఆత్మకూరు మండల పరిశీలకుడిగా చాబోలు ఇలియాస్.**

**ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు జూన్ 30:** తెలుగుదేశం పార్టీ పట్ల దశాబ్దాలుగా అభిమానం మరియు అంకితభావంతో పనిచేస్తూ, కష్టకాలంలోనూ పార్టీకి అండగా నిలిచి, తుచా తప్పక పార్టీ ఆదేశాలను పాటిస్తూ ముందడుగు వేసిన నాయకుడు నీటి సంఘం చైర్మన్ చాబోలు ఇలియాస్. గత కొన్ని దశబ్దాల నుండి తెలుగుదేశం పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధతను గుర్తించి, శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరు మండల పరిశీలకుడిగా ఆయనను నియమించడం జరిగింది. ఈ క్రమంలో నేడు ఆత్మకూరు మండల సంస్థాగత ఎన్నికల సమావేశం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిని సమావేశానికి నీటి సంఘం అధ్యక్షుడు ఆత్మకూరు మండల పరిశీలకులుగా చాబోలు ఇలియాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చోబోలు ఇలియాస్ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు నాశనమయ్యాయని,




కక్షపూరిత రాజకీయం వల్ల రాష్ట్ర అభివృద్ధి తలకిందులైందని విమర్శించారు. ఈ రోజు రాష్ట్రానికి వచ్చిన కూటమి ప్రభుత్వం లక్షలాది తెలుగుదేశం కార్యకర్తల శ్రమకు ఫలితమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు మంత్రి నారా లోకేష్ రాష్ట్ర అభివృద్ధి కోసం చేస్తున్న కృషి ప్రతి కార్యకర్తకు ప్రేరణగా నిలవాలని అన్నారు. తమ గ్రామాల్లో, వార్డుల్లో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలును ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ప్రతి నాయకుడి మీద ఉందని



పిలుపునిచ్చారు.

తెలుగుదేశం పార్టీ ప్రతి కార్యకర్త ప్రజల సమస్యలను తెలుసుకొని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లిపరిష్కరించాలన్నారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు రవీంద్ర,టౌన్ అధ్యక్షులు వేణుగోపాల్,మైనారిటీ నాయకులు నూర్ బేగ్,ఇతర మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఆర్థిక పండితుడు దాదాభాయ్ నౌరోజీ

# సేవలు చిరస్మరణీయం.

### సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి.



**ఆంధ్ర ప్రగతి డోన్ జూన్ 30:** జూన్ 30 న స్వాతంత్ర్య సమరయోధుడు దాదాభాయ్ నౌరోజీ వర్ధంతి సందర్భంగాడోన్ పట్టణం లో సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో దాదాభాయ్ నౌరోజీ ప్రఖ్యాత భారతీయ స్వాతంత్ర్య సమరయోధుడు మరియు ఆర్థిక పండితుడు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. దాదాభాయ్ నౌరోజీని తరచుగా "భారత ఆర్థిక శాస్త్ర పితామహుడు" అని పిలుస్తారు. దాదాభాయ్ నౌరోజీ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించి వారిని స్మరించుకున్నారు.ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి మాట్లాడుతూ..మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి కోరారు.

# మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు సంఘీభావం తెలిపిన ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్.!

### ..రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలి.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 30:**

రాష్ట్ర మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించడం కొరకు ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ ఆదేశాల మేరకు నంద్యాల మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులకు మద్దతు తెలిపిన ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ సభ్యులు

రాష్ట్ర వ్యాప్తంగా 13,000 వేల మందికి పైగా ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలని సమస్యలను పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లెజెండ్ శ్రీను అన్నారు. మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళితే ప్రజలు పడే ఇబ్బందులను ప్రభుత్వం ఎదుర్కోవాల్సి ఉంటుందని తక్షణమే ప్రభుత్వమే బాధ్యత వహించి,మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్ల సమస్యను పరిష్కరించాలని ఇండియన్ రిపోర్టర్స్ జిల్లా అధ్యక్షుడు ప్రభుత్వాన్ని కోరారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ ఎల్లప్పుడు అండగా నిలబడుతుందని ప్రజల కోసం ఇంత సేవ చేస్తున్న మున్సిపల్ కార్మికుల పట్ల సహృదయంతో వ్యవహరించి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కారంలో భాగంగా జీవో నెంబర్ 36 ప్రకారం కార్మికుల అందరికీ 21 వేల రూపాయలు వేతనం ఇవ్వాలని,గ్రేడ్ల ప్రకారం అయితే 24 వేల రూపాయలు వర్తించే అవకాశం ఉందని,పది సంవత్సరాలు చేసి రిటైర్ అయిన వారందరికీ 75 వేల రూపాయలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించాలని, మృతి చెందిన కార్మికులకు 10 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా చెల్లించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఇంజనీరింగ్ కార్మికులకు పదవి విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని,చనిపోతే మట్టి ఖర్చులకు 20 వేల రూపాయలు ఇవ్వాలని,హెల్త్ అలవెన్స్ లను పెంచాలని ప్రభుత్వాన్ని ఇండియన్ రిపోర్టర్స్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. మున్సిపల్ కార్మికులకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రిపోర్టర్స్ జాతీయ కార్యదర్శి జాషువా బాబు మరియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శరత్ బాబు,రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారావు మరియు ఇండియన్ రిపోర్టర్ అసోసియేషన్ సభ్యులు ముసుగు రాజు,పవన్ యాదవ్,గుండం గంగాధర్ రెడ్డి,జమాల్ బాషా పాల్గొన్నారు.

### మనసున్న మారాజు తాతిరెడ్డి తులసిరెడ్డి కి

# ఘనంగా పుట్టినరోజు వేడుకలు..!

**న్యాయవాదిగా...రాజకీయ నాయకునిగా...దైవ భక్తుడిగా గుర్తింపు. ...పేదలు...రైతులు...కార్యకర్తలు బాగుండాలీ.**

**...రైతులు ఆనందంగా ఉంటే...దేశం ఆనందంగా ఉంటుంది. ...అభిమానుల కోలాహలం మదు కేక్ కటింగ్.**

**...కేకులుశలువాలు,గజమాలలు,పూలదండలతో ముంచెత్తుతున్న అభిమానులు.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 29:**

దేశంలో రైతులు,పేద ప్రజలు,కార్యకర్తలు ఆనందంగా జీవించాలన్నదే ఆయన ధ్యేయం....రైతులు ఆనందంగా ఉంటేనే..దేశం లో నివసిస్తున్న ప్రజలు ఆనందంగా ఉంటారనేది ఆయన నమ్మకం...సృష్టిలో జన్మించిన ప్రతి ఒక్కరు తాకు వచ్చే అవకాశాలతో పదిమందికి న్యాయం చేస్తే ఆ భగవంతుని కృపాకటాక్షలు లభిస్తాయని గట్టిగా నమ్మే స్వభావం ఆయనది...సమాజంలో ఎవరైనా ఏదైనా ఒక రంగంలో మాత్రమే పేరు ప్రఖ్యాతులు వస్తాయి అనేది సత్యం...ఒకే ఒకరికి మూడు రంగాల్లో అభిమానులు ఉండడం అరుదు.మూడు రంగాల్లో మచ్చలేని మనసున్న మారాజు సీనియర్ న్యాయవాది,రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి అని చెప్పవచ్చు.సామాన్య రైతు కుటుంబంలో జన్మించి చిన్న తనం నుంచే తల్లిదండ్రులు నేర్పించిన క్రమశిక్షణ ఆయనను ఇంత వాడిని చేసింది.చిన్న తనంలో చదువుకుంటూ తండ్రితోబ్బాటు పొలాల్లో తిరుగుతూ పంటలు ఎలా పండించాలి,రైతులు పడుతున్న బాధలు కళ్ళారా చూసారు.ఆయన పుట్టిన గ్రామంలో ఎందరో పేద ప్రజలు పడుతున్న కష్టాలను కళ్ళారా చూసి చలించిపోయాడు. చిన్నవయస్సు లోనే ఎవరికైనా సహాయం చేయాలన్నా ఆలోచన ఉండేది.చిన్నతనం నుంచే పేదవారికి సహాయం చేయాలని,న్యాయవాది కావాలని మనసులో అనుకున్నారు.ప్రధానంగా ఆయనకు వీటితో పాటు దైవ భక్తి అధికంగా ఉండడంతో ఆ దేవ దేవుడు శివయ్య మూడు రంగాల్లో ఆయనకు పేరు తెచ్చిపెట్టారని చెప్పుకోవడం విశేషం.కాలానికి అనుగుణంగా చిన్న తనంలో మనసులో అనుకున్న విధంగా న్యాయవాది వృత్తిలో రాణించారు.పేదప్రజల న్యాయం చేశారు.రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు.నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మెన్ పదవి ఆశపడిన నమ్ముకొని పనిచేసిన నేతలు అడుగడుగునా అడ్డుకోవడంతో ఆ పార్టీకి గుడ్ బై చెప్పి టీడీపీ లో చేరారు.గతంలో గ్రామ సర్పంచు గా గెలుపొంది గ్రామ ప్రజల మన్ననలు పొందారు.టీడీపీలో చేరడం ఎన్నికలు రావడంతో నంద్యాల అసెంబ్లీ అభ్యర్థిగా ఎన్.ఎం.డి.ఫరూక్ ,పార్లమెంట్ అభ్యర్థిగా బైరెడ్డి శబరి లను అధిష్టానం ప్రకటించడంతో వారిద్దరి విజయానికి కీలక పాత్ర పోషించారు.ఎన్నికల్లో చురుకుగా పాల్గొనడంతో అధిష్టానం దృష్టిలో పడ్డారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఘన విజయం సాధించడంతో తులసి రెడ్డి కి రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ పదవి వరించింది.ఆ నటి నుంచి రాజకీయంగా నలిగిపోతున్న కార్యకర్తలకు భరోసాగా ఉన్నారు.రైతులు పండించిన పంటలకు సాగునీరు లేకపోవడంతో అధిష్టానం దృష్టికి తీసుకొని వెళ్ళడంతో వెలుగోడు రిజర్వాయర్ నుంచి తెలుగుగంగకు నీళ్ల వచ్చేందుకు కృషిచేశారు.మరో వైపు జొన్న రైతుల సమస్యలను గుర్తించి మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించారు.రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలు సందర్శిస్తూ పలువురి పీఠాధిపతుల ఆశీర్వాదాలు పొందుతున్నారు.గ్రామంలో దేవాలయాలు జీర్ణోద్ధరణ స్థితిలో ఉన్నవారిని పునర్నిర్మాణం చేసి మూడురోజులు పాలు దేవతా మూర్తులను ప్రస్తించారు.దేవాలయంలో మరకత లింగం ప్రతిష్ఠ చేసి ఎందరో భక్తులకు గ్రామంలోని అందరి సహాయ సహకారాలతో అన్నదానం చేశారు.దేవుడి అనుగ్రహం ఉండడం వల్లే న్యాయవాదిగా,రాజకీయ నాయకునిగా,దైవ భక్తుడిగా పేరు రావాలంటే ఎంతో అదృష్టం చేసి ఉండాలి.ఈ రోజు ఆయన జన దినం కావడంతో అన్ని వర్గాల అభిమానులు గజమాలలు,పూల దండలు,కేకు కటింగ్,శాలువాలు కప్పుతూ మిఠాయిలు తినిపించి తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు.సాయంత్రం భారీ గజామలతో పాటు భారీ కేకు కటింగ్ చేయనున్నారు.యువత ఆయన పుట్టినరోజు సందర్భంగా టపాసులు కాల్చుతూ అభిమానాన్ని చాటుకున్నారు.తన పుట్టినరోజు సందర్భంగా నంద్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు,వారి వెంట వచ్చిన బంధువులు అందరికీ అన్నదానం చేశారు.ఎందరో మనసుల హృదయాలు గెలుచుకున్న ఆయన కుటుంబసభ్యులు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని పురోహితులు దీవించారు.













# బనగానపల్లె కార్పెంటర్ గృహాల కూల్చివేతను తక్షణమే ఆపాలి.

### నంద్యాల జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన ఎస్ డి పి ఐ జిల్లా నాయకులు.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 30:**బనగానపల్లెలో వందలాది కుటుంబాలు నివసిస్తున్న కార్పెంటర్లు తమ శ్రమతో నిర్మించుకున్న గృహాలను బుల్డోజర్ తో కూల్చివేస్తున్న కూటమి ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండిస్తూ, నంద్యాల జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు కార్పెంటర్ అసోసియేషన్ ప్రతినిధులు మరియు సోషల్డ్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా నాయకులు.సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ కలాం మాట్లాడుతూకార్మిక వర్గానికి చెందిన బనగానపల్లి కార్పెంటర్ అసోసియేషన్ కు గత ప్రభుత్వము గృహాల నిర్మాణ కోసం భూమిని మంజూరు చేయడం జరిగింది కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వము లోని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వీరిపై కక్షగట్టి అక్కడి దగ్గర్లో ఉండే వాగును వెడల్పు చేయాలనే సాకుతో వీరు నిర్మించుకోబోతున్న గృహాలను కూల్చేయాలని బుల్లోజర్లతో వచ్చి కొన్ని గృహాలను కూడా కూల్చడం జరిగిందని దీని తీవ్రంగా ఖండిస్తున్నామని వెంటనే నంద్యాల జిల్లా కలెక్టర్ వెంటనే కలగజేసుకొని ఈ యొక్క చర్యను ఆపి అక్కడి కార్పెంటర్ల గృహాలను కాపాడాలని కోరారు.బలహీన వర్గాలపై జరిగే ఈ అన్యాయాన్ని తక్షణమే నిలిపివేయాలని, బాధితులకు న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ డి పి ఐ నంద్యాల జిల్లా అధ్యక్షులు మణిహారం హనీఫ్, జిల్లా నాయకులు ఈ కరీముల్లా, బనగానపల్లి కార్పెంటర్ అసోసియేషన్ అధ్యక్షులు చాంద్ బాషా, ఇతర నాయకులు, బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జొన్న కొనుగోలుకు బ్రేక్..!

### ఆందోళనలో రైతన్నలు.

### రైతుల ఆవేదనను మార్క్ ఫెడ్ ఎండి దృష్టికి తీసుకెళ్లిన రాష్ట్ర డైరెక్టర్ తులసి రెడ్డి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 30:** జొన్న రైతులతాము సాగుచేసిన పంటను ప్రభుత్వ్రమే కొనుగోలు చేస్తుండటంతో ఎంతో సంతోషించారు. గిట్టుబాటు ధర లభించక ఇబ్బందులు పడిన రైతున్నకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. దీంతో రైతన్నలు ఊహించిన ధరకన్నా ఎక్కువ చెల్లించి రైతుల వద్ద ఉన్న జొన్నలను కొనుగోలు చేసింది. నంద్యాల జిల్లాలో ఎపి మార్క్ ఫెడ్ డైరెక్టర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి తాతిరెడ్డి తులసిరెడ్డి సహకారంతో.. రైతులు తమ వద్ద ఉన్న జొన్నలను ప్రభుత్వానికి అమ్మేశారు.

అయితే.. కొంత మంది రైతులు తమ వద్ద ఉన్న జొన్నలను సకాలంలో మార్కెట్ కు చేర్చలేక పోయారు. ఈ నేపద్యంలో ఈనెల 23 వ తేది వరకు కొనుగోళ్ళకు ప్రభుత్వం అనుమతించింది. కాని,, ఇక్కడ రైతులకు ఇబ్బందులు మొదలయ్యాయి. జొన్న కొనుగోలుకు ట్రాక్ షీట్ ఇచ్చిన అధికారులు, ఇప్పుడు జొన్న కొనుగోలు చెయ్యడం లేదని చావుకబురు చల్లగా చెప్పారు. అధికారుల వైఖరిని పట్ల ఆవేదన చెందిన గడివేముల, గోస్పాడు, తదితర ప్రాంతాలకు చెందిన రైతులు ఏపి మార్క్ ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి దృష్టికి తమ సమస్యను తీసుకోవెళ్ళారు.రైతన్నల ఆవేదన, బాధను అర్థం చేసుకున్న తులసిరెడ్డి నేరుగా నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ ను కసిలి సమస్యను వివరించారు. ప్రస్తుతం జొన్న కొనుగోలు చేసే వెబ్ సైట్ మూసివేయ్యడంతో కొనుగోలు సాద్యం కాదని చెప్పారు. అయితే, గడివేముల, గోస్పాడు ప్రాంతాలకు చెందిన జొన్న రైతులకు కొనుగోలుకు ట్రాక్ షిట్ ఇచ్చారు. దీంతో, ఆయ ప్రాంతాల రైతులు శివకుమార్ రెడ్డి, కృష్ణారెడ్డి, రాంభూపాల్ రెడ్డి మాట్లడుతూ.. జొన్నల లోడ్ చేసుకున్న లారీలు, ట్రాక్టర్లలో ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ వద్ద గత వరం రోజులుగా వేచి ఉన్నామని చెప్పారు. సుమారు 30కి పైగా లారీలలో జొన్నలు కాని.. అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇప్పుడు కొనుగోలు చెయ్యడం సాద్యం కాదని, వెబ్ సైట్ మూసివేశారని చెప్పడం విడ్డురంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యను అర్థం చేసుకున్న ఎపి మార్క్ ఫెడ్ డైరెక్టర్ తులసి రెడ్డి , ఎపి మార్క్ ఫెడ్ ఎండి మనజీర్ జిలాని శామూన్ తో ఫోనులో మాట్లడే ప్రయత్నం చేశారు. మార్క్ ఫెడ్ ఎండి తో తానూ మాట్లాడి జొన్నల కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం నుంచి ఒప్పిస్తానని హామీ ఇచ్చారు. నంద్యాల జిల్లా నుంచి మార్క్ ఫెడ్ ద్వార ఇప్పటికే వేలాది క్వింటాళ్ళ జొన్నలు కొనుగోలు చేశామని, రైతులకు నగదు కుడా వారి అకౌంట్స్ లో వేశామన్నారు. రైతుల వద్ద ఉన్న చివరి బస్తా వరకు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసి రెడ్డి రైతన్నలకు భరోసా ఇచ్చారు. ఇది రైతు ప్రభుత్వం అని, రైతు సంక్షేమమే తమ ధ్యేయమని తులసి రెడ్డి స్పష్టం చేశారు.

# వైద్యుల సేవలు ప్రశంసనీయం..

## -కలెక్టర్ రాజకుమారి. -ఐఎంఏ ఆధ్వర్యంలో ఘనంగా వైద్యుల దినోత్సవం.

**వైద్యుల దినోత్సవ పురస్కారాలు అందుకున్న వైద్యులు కోడూరు ప్రభాకర్ రెడ్డి, మురళీధరరావు,శరత్ చంద్రారెడ్డి, శేష ఫణి, జ్యోతి వాణి, ఆశాలత, సరిత,**

**- వైద్యుల దినోత్సవ సామాజిక సేవ పురస్కారాలు అందుకున్న ఎంపీ.వి. రమణయ్య, చిత్తలూరి రామచంద్రయ్య.**








పురస్కారం అందుకుంటున్న డాక్టర్ శరత్ చంద్ర రెడ్డి



పురస్కారం అందుకుంటున్న డాక్టర్ కోడూరు ప్రభాకర్ రెడ్డి



పురస్కారం అందుకుంటున్న డాక్టర్ జ్యోతి వాణి



సామాజిక సేవ పురస్కారం అందుకుంటున్న ఎంపీ వి రమణయ్య



పురస్కారం అందుకుంటున్న డాక్టర్ ఆశాలత



వైద్యుల దినోత్సవ పురస్కారం అందుకుంటున్న డాక్టర్ మురళీధర్ రావు



పురస్కారం అందుకుంటున్న డాక్టర్ సరిత

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 30:**

ఐఎంఏ నంద్యాల ఆధ్వర్యంలో భారతరత్న డాక్టర్ బి.సి.రాయ్ జన్మదినోత్సవం సందర్భంగా స్థానిక జయంతా ఫంక్షన్ హాల్ సమావేశ మందిరంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు.

నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు అధ్యక్షతన, కార్యదర్శి డాక్టర్ పనిల్ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి ముఖ్యఅతిథిగా,గౌరవ అతిథులుగా ఐఎంఏ రాష్ట్ర ప్రెసిడెంట్ ఎలెక్ట్ బాలరాజు,రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ నర్సింగ్ హోమ్స్ అధ్యక్షులు ఏవి సుబ్బారెడ్డి పాల్గొన్నారు. కలెక్టర్ రాజకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. డాక్టర్ బి. సి.రాయ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఐఎంఏ వైద్యుల దినోత్సవ పురస్కారాలను ప్రముఖ కవి, రచయిత ప్రొద్దుటూరు కు చెందిన డాక్టర్ డాక్టర్ కోడూరు ప్రభాకర్ రెడ్డి, నంద్యాల వైద్యులు డాక్టర్ మురళి ధర్ రావు, డాక్టర్, డాక్టర్ శరత్ చంద్ర రెడ్డి, డాక్టర్ శేష ఫణి,డాక్టర్ జ్యోతి వాణి, డాక్టర్ ఆశాలత,డాక్టర్ సరిత, సామాజిక సేవలకు జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.పి.వి. రమణయ్య, చిత్తలూరి రామ చంద్రయ్య లకు కలెక్టర్ రాజకుమారి అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ . వైద్యులు రోగి ప్రాణాలు కాపాడడానికి తమ శాయ శక్తుల ప్రయత్నం చేస్తారని, వైద్యో నారాయణో హరి గా భారత సంస్కృతిలో చెప్పారన్నారు. కోవిడ్ సమయంలో వైద్యులు తమ ప్రాణాలు ఫణంగా పెట్టి చేసిన సేవలు సమాజం ఎన్నటికి మరువవదన్నారు. వైద్యులు మానవతా దృక్పథంతో సేవలందించాలని పిలుపునిచ్చారు.నంద్యాల వైద్యులు సేవా దృక్పథంతో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు.డాక్టర్ బాల రాజు,డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ఐఎంఏ దేశంలో 1928లో ప్రారంభించబడిందని ఇప్పుడు 35 రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలలో 1750 బ్రాంచీలలో నాలుగు లక్షల మంది సభ్యులతో ప్రపంచంలో అతిపెద్ద వృత్తి స్వచ్ఛంద సంస్థ ఐఎంఏ అని అన్నారు.దేశంలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడానికి కృషి చేస్తున్నదని చెప్పారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 100 బ్రాంచ్ లలో ఇరవై రెండు వేల మంది ఐఎంఏ సభ్యులు అటు ప్రభుత్వ రంగంలో, ప్రైవేటు రంగంలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారని, వీరి రక్షణ చట్టాన్ని రాష్ట్రంలో మరింత కఠిన తరం చేయాల్సిన అవసరం ఉందని అదేవిధంగా జాతీయస్థాయిలో కూడా వైద్య రక్షణ చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు.

కలెక్టర్ రాజకుమారిని నంద్యాల వైద్యులు ఘనంగా సత్కరించి అభినందించారు.

జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్యులకు, వైద్యుల కుటుంబ సభ్యులకు నిర్వహించిన వివిధ క్రీడా పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ మధుసూదన రావు కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, ఐఎంఏ రాష్ట్ర ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టర్ బాలరాజు, రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ,ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ విజయభాస్కర రెడ్డి,ఐఎంఏ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన రెడ్డి, డాక్టర్ అనిల్ ,నంద్యాల శాఖ మహిళా విభాగ నాయకులు డాక్టర్ నర్మద ,డాక్టర్ నాగమణి, డాక్టర్ లక్ష్మీ సౌజన్య, డాక్టర్ కల్పన, డాక్టర్ అరుణకుమారి, డాక్టర్ శైలజ, డాక్టర్ సునీత, డాక్టర్ లలిత అధిక సంఖ్యలో వైద్యులు కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. వైద్యుల దినోత్సవ నిర్వహణకు డాక్టర్ హరినాధ రెడ్డి, డాక్టర్ లక్ష్మీప్రసన్న, డాక్టర్ సంజీవ్ కుమార్, డాక్టర్ సరిత, డాక్టర్ రామ సుబ్బారెడ్డి, డాక్టర్ రూపేంద్ర నాథ్ రెడ్డి సహకారం అందించారు.



పురస్కారం అందుకుంటున్న డాక్టర్ శేష ఫణి



సామాజిక సేవా పురస్కారం అందుకుంటున్న రామచంద్రయ్య

# ప్రభుత్వాసుపత్రిలో సమస్యలన్నీ త్వరగా పరిష్కరించాలి..

**రాష్ట్ర మంత్రి టి.జి భరత్**

**రోగులకు మెరుగైన వైద్యం అందాలి**

**విద్యుత్ సమస్య, ఫైర్ సమస్య లేకుండా చూసుకోవాలి**

**సీసీ కెమెరాలు, పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలి**

**హాస్పిటల్‌లోని భవనాలు లీకేజీ సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలి**

**హాస్పిటల్ వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించిన మంత్రి టి.జి భరత్**



**కర్నూలు జూన్ 30 ఆంధ్ర ప్రగతి**

కర్నూలు ప్రభుత్వాసుపత్రిని అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ చెప్పారు. సోమవారం ప్రభుత్వ వైద్య కళాశాలలోని అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ కాన్ఫరెన్స్ హాల్ లో వైద్యాధికారులు, సిబ్బందితో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో నిర్వహించిన అంశాల వారీగా చర్చించి వివరాలు అడిగారు. ప్రభుత్వాసుపత్రిలో నెలకొన్న సమస్యలన్నీ త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌తో పాటు అధికారులను ఆయన ఆదేశించారు. ఆసుపత్రిలో విద్యుత్ సమస్య ఎక్కడా ఉండకూడదని చెప్పారు. ఏఎంసీ, గైనిక్ ఓటీ, సూపర్ స్పెషాలిటీ ఓటీల్లో యూపిఎస్ కనెక్షన్ ఇవ్వాలని ఆదేశించారు. ఈ విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలక్ట్రికల్ పరికరాలన్నీ సీఎంసీ కిందకి తీసుకురావాలన్నారు. ఈ విషయంలో తాను ఉన్నతాధికారులతో మాట్లాడతానని మంత్రి తెలిపారు. అవసరమైన అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పెట్టాలని ఆదేశించారు. సెక్యూరిటీ విషయంలో రాజీపడొద్దన్నారు. పిజి హాస్టల్ వద్ద స్ట్రీట్ లైటింగ్, పెద్ద పెద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. ఐ హాస్పిటల్ లో ఫండ్స్ ఉన్నపటికీ పరికరాలు కొనుగోలు చేసేందుకు అనుమతులు కావాలని ఐ హాస్పిటల్ సూపరింటెండెంట్ మంత్రి దృష్టికి తీసుకొని రాగా.. జిల్లా కలెక్టర్ తో అనుమతులు ఇప్పించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇక ఓల్డ్ సిటి వాసులకు ఎంతో ఉపయోగపడే గడియారం ఆస్పత్రిని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చిన్నపిల్లల వైద్యుడితో పాటు గైనకాలజిస్టును గడియారం ఆస్పత్రికి కేటాయించాలని, ఇప్పటికిప్పుడు డిప్యుటేషన్‌పై అయినా అక్కడకు పంపాలని చెప్పారు. వైద్యులు అక్కడ అందుబాటులో ఉంటే ఆ ప్రాంత వాసులకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. గైనకాలజిస్ట్, చిన్నపిల్లల వైద్యుల నియామకానికి పేపర్ నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. రోగులకు మందులు బయట కొనాలని పలువురు సిబ్బంది పంపుతున్నారని వస్తున్న ఫిర్యాదులపై మంత్రి సీరియస్ గా స్పందించారు. ఇలా ఎవరైనా చేస్తే కఠినంగా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఫైర్ సేఫ్టీ విషయంలో నిత్యం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

హాస్పిటల్‌లో రోగులు, సహాయకులకు మరుగుదొడ్ల ఇబ్బందులు ఉండకూడదని మంత్రి చెప్పారు. అన్ని మరుగుదొడ్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. హాస్పిటల్‌లో ఉన్న జంగిల్ మొత్తం క్లీన్ చేయాలని ఆదేశించారు. టైం లైన్ పెట్టుకొని పని పూర్తి చేయాలని సంబంధిత అధికారిని ఆదేశించారు. హాస్పిటల్ హద్దులు సర్వేచేసి నివేదిక ఇవ్వాలన్నారు. ఆసుపత్రిలో గ్రీనరీ పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని హార్టికల్చర్ అధికారులకు సూచించారు. హాస్పిటల్‌లో అవసరమైన సిబ్బందిని రిక్రూట్ చేసుకునేందుకు నిబంధనలకు అనుగుణంగా ప్రక్రియ ప్రారంభించాలన్నారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కానింగ్ యంత్రాల పనితీరుపై మంత్రి ఆరా తీశారు. సీటీ టెక్నిషియన్ కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపించినట్లు వారు తెలిపారు. ఈ విషయంపై తాను ఉన్నతాధికారులతో మాట్లాడతానని ఆయన చెప్పారు. హాస్పిటల్‌లో పార్కింగ్ స్థలాలను మెరుగుపరచాలని చెప్పారు. వైద్యులు, రోగులు, ఉద్యోగులు, విద్యార్థుల వాహనాలకు ఇబ్బంది లేకుండా పార్కింగ్ ఉండాలన్నారు. ఇక హాస్పిటల్ లోని మొత్తం భవనాలను లీకేజీ ఉన్నాయో లేదో పరిశీలించాలని ఆదేశించారు. లీకేజీ సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు, జి.జి.హెచ్ సూపరింటెండెంట్ డా..వెంకటేశ్వర్లు, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా.చిట్టి నరసమ్మ, జి జి హెచ్ ఏఓ సింధు సుబ్రమణ్యం, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ క్రీడల విజేతలకు ఏపీ ప్రభుత్వం భారీ నగదు ప్రోత్సాహకాలు

## ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ సంయుక్తంగా నిధుల విడుదల

**విజయవాడ,జూన్ 30 ఆంధ్ర ప్రగతి**




రాష్ట్ర కీర్తి ప్రతిష్టలను జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసిన క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా ఏపీలోని కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవల ఉత్తరాఖండ్‌లో నిర్వహించిన 38వ జాతీయ క్రీడా పోటీల్లో సత్తా చాటి పతకాలు సాధించిన రాష్ట్ర క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలను ప్రకటించింది. ఈ మేరకు మొత్తం రూ.91.75 లక్షల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.జాతీయ క్రీడల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన 15 మంది ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులకు ఈ నగదు బహుమతి అందనుంది. రాష్ట్ర ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) సంయుక్తంగా ఈ నిధులను మంజూరు చేశాయి. క్రీడాకారులలో స్ఫూర్తిని నింపడంతో పాటు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేందుకు వారిని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.గత కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న విషయం తెలిసిందే. జాతీయ, అంతర్జాతీయ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా యువతను క్రీడల వైపు ఆకర్షించేందుకు కృషి చేస్తోంది. తాజాగా ప్రకటించిన ఈ నజరానాతో క్రీడాకారుల్లో నూతనోత్సాహం వెల్లివిరుస్తోంది.

# ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై నారా లోకేశ్ ప్రశంసలు

**విజయవాడ,జూన్ 30 ఆంధ్ర ప్రగతి**

ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు తీసుకున్న నిర్ణయంపై రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రశంసల వర్షం కురిపించారు. తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఆదర్శంగా నిలిచిన ఆ ఉపాధ్యాయుడికి అభినందనలు తెలిపారు. ఇలాంటి సంఘటనలు చూసినప్పుడు విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసం పడిన శ్రమను మరిచిపోవచ్చని ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.వివరాల్లోకి వెళితే, రాజాం నియోజకవర్గం డోలపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు డోల వాసుదేవరావు, తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ బడిలోనే చదివిస్తున్నారు. ఈ విషయంపై స్పందించిన మంత్రి లోకేశ్ వాసుదేవరావు లాంటి వారిని చూసినప్పుడు తాను కోరుకున్న మార్పు ఇదేనని అనిపిస్తోందని అన్నారు. రాజకీయాలకు దూరంగా, సమగ్ర విద్యకు దగ్గరగా పాఠశాలలను తీర్చిదిద్దేందుకు పడిన కష్టానికి ఫలితం దక్కుతోందని ఆయన అభిప్రాయపడ్డారు."ప్రభుత్వ పాఠశాలల ముందు 'నో అడ్మిషన్' బోర్డులు చూడాలన్నదే నా ఆకాంక్ష. ఒక ఉపాధ్యాయుడే తన పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పిస్తున్నప్పుడు, ఇతరులు ఎందుకు చదివించకూడదు అనే ఆలోచన ప్రజల్లో రేకెత్తించిన వాసు మాస్టర్‌కు నా అభినందనలు" అని లోకేశ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. విద్యా వ్యవస్థలో చేపట్టిన సంస్కరణలు, సమస్యల పరిష్కారానికి ఇది నిదర్శనమని ఆయన తెలిపారు.అంతేకాకుండా, "మన బడికి మనమే అంబాసిడర్స్‌గా నిలుద్దాం. అందరం కలిసి మన రాష్ట్రాన్ని దేశానికే దిక్సూచిగా నిలిచే 'ఏపీ మోడల్ ఎడ్యుకేషన్' కేంద్రంగా తీర్చిదిద్దుదాం" అని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుడి చర్య ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# కలవరపెడుతున్న వర్షాభావ పరిస్థితులు

## నదుల అనుసంధానంపై కానరాని చిత్తశుద్ధి -పర్యావరణ పరిరక్షణలో పాలకుల నిర్లక్ష్యం

న్యూఢిల్లీ,**జూన్ 30 ఆంధ్ర ప్రగతి**

వర్షాభావ పరిస్థితులు పదేళ్లకోసారి తప్పవని నిపుణులు అంటున్నారు. నైరుతి ప్రవేశించినా నేటికీ వర్షం జాడలేదు. అడపాదడపా అక్కడక్కడా పడుతున్న వర్షం లెక్కల్లోకి రాదు. వర్షాలు ముఖం చాటేస్తే జలాశయాలు వట్టిపోతాయి. లక్షలాది మంది రైతులు వర్షాలు కురిసి కాలం కలసివచ్చినా నష్టపోతున్నారు. వర్షాలు పడని సంవత్సరంలో పంటలు ఎండిపోయి నష్టపోతున్నారు. కాలం అయినా గాని, కరువు అయినా గాని రైతుకు మిగిలేది అప్పులే. నిపుణుల సలహాతో వ్యవసాయరంగాన్ని పారిశ్రామిక రంగంగా అభివృద్ది చేయగలిగితే దేశం ఆర్థికంగా బలోపేతం కాగలదు. గతంలో లాగా వాగులు వంకలు పొంగే పరిస్థితి లేదు. వర్షాల తీరు ఇలాగే ఉంటే నీటి కష్టాలు తప్పేలా లేవు. ఇలాంటి సందర్భాల్లోనే ప్రత్యామ్నాయాలు ఆలోచన చేయాలి. పాలకులకు దూరదృష్టి అవసరం. నదీజలాలలను ఏటా వృధాగా సముద్రంలోకి వదలాల్సిన దుస్థితి నుంచి బయటపడాలి. వాటిని సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేయాలి. నదీ జలాలలను దేశం మొత్తానికి అందేలా...ప్రణాళికలు రూపొందించాలి. నదుల అనుసంధానంపై చర్చించాలి. దీనిపై సమగ్ర నివేదికలు రూపొందించాలి. నిపుణలను నియమించి గంగా,యమున,బ్రహ్మపుత్ర నదులను అనుసంధా నించే ప్రక్రియ చేపట్టాలి. ఈ దశలో నీటి సంరక్షణతో పాటు, రైతు సంక్షేమానికి చర్యలు తీసుకునే ప్రణాళికలు ముందుకు సాగాలి. మోడీ తొలినాళ్లలో నదుల అనుసంధానం గురించి మాట్లాడారు. కానీ ఇప్పుడా మాట ఎత్తడం లేదు. ఇకపోతే వర్షాల ద్వారా మనం పాఠాలు నేర్చుకోవాలి. వరదలను నివారించి, నీటిని నిల్వ చేసుకునే పద్దతలను అవలంబించాలి. దేశవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగుతున్న సమయంలో వాటిని జలాశయాల్లోకి మళ్లించేలా ప్రణాళికలు చేసుకోవాలి. ఉన్నకొద్దిపాటు ప్రాజెక్టుల నుంచి నీరు విడుదల చేయడంతో మళ్లీ సముద్రంలోకి నీరు చేరుతోంది. ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో దేశంలో నీటి యాజమాన్యం సరిగా లేదని ఏటా కురుస్తున్న వర్షాలు స్పష్టం చేస్తున్నాయి. దీనికితోడు అనేక జలాశయాల్లో పూడిక పేరుకుని పోతోంది. ఏటేటా వర్షాలతో ఒండ్రు చేరుతోందని నిపుణులు చెబుతున్నారు. గతంలో వరదలకు ఉత్తరాది, దక్షిణాది అన్న తేడా లేకుండా అనేక నదులు ఉప్పొంగాయి. చివరకు మళ్లీ నీరు సముద్రానికి చేరింది. ఈ దుస్థితి పోవాలంటే నీటి యాజమాన్యం అవసరం. ఇప్పటికైనా పాలకులు జాతీయ జలవిధానం రూపొందించాల్సి ఉంది. అలాగే వ్యవసాయం పై కూడా జీతాయ విధానంతో ముందుకు సాగాలి. వ్యవసాయాన్ని లాభసాటి చేసేలా, దిగుబడులు పెంచుకునేలా రైతులను



ప్రోత్సహించేలా చూసుకోవాలి. వివిధ రాష్ట్రాల్లో చెరువులను కబ్జాకోరులు మింగిన పాపానికి ఏటా కురుస్తున్న వర్షాలకు నగరాలు, పట్టణాలు, గ్రామాలు నీట మునిగిపోతున్నాయి. ఇదంతా పాలకుల పాపం కాక మరోటి కాదు. ఈ క్రమంలో గొలుసుకట్టు చెరువులను రక్షించుకోవాలి. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని కనీసం ఇప్పటి నుంచయినా నీటి అవసరాలను గుర్తించి పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి. వర్షపునీటిని ఒడిసి పట్టుకుని ముందుకు సాగేలా ప్రణాళికలు చేసుకోవాలి. ఇది రాష్ట్రానికి, దేశానికి కూడా వర్తించేలా ఉండాలి. దేశ జనాభా పెరుగుతున్న క్రమంలో మన వ్యవసాయాన్ని బలోపేతం చేసుకునే దిశగా ఆలోచనలు చేయాలి. వ్యవసాయ ఉత్పత్తులను పెంచి విదేశాలకు ఎగుమతి చేసే విధంగా సన్నద్ధం కావాలి. ఆర్థికమాంద్యం ముంచుకొస్తున్న వేళ కేంద్రం ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటే ఓ పదేళ్లకు కాని ఆచారణలోకి రాదు. వ్యవసాయరంగం పురోగమిస్తే, ధాన్యం దిగుబడులు తగ్గితే తప్ప భారత ఆర్థికరంగం పురోగ మించదు. ఇప్పటికే వరిధాన్యం ఇబ్బడి ముబ్బడిగా పండించడం వల్ల గోదాముల్లో మగ్గి పోతోంది. వాటిని వాడుకునే విధంగా కార్యక్రమాలు అమలు చేసుకోవాలి. అదేపని గా వరి పండించకుండా ఇతర పంటలపైనా ప్రోత్సాహం కల్పించాలి. వంటనూనెల కోసం విదేశాలపై ఆధారపడకుండా దేశీయంగా నూనెగింజల ఉత్పత్తులను పెంచుకోవాల్సి ఉంది. ప్రధానంగా అనేకరకాల పప్పు ధాన్యాలు, వంట నూనెల దిగుమతులను పూర్తిగా నిషేధించుకుని, దేశీయంగా పండించుకునేలా వ్యవసాయాన్ని ప్రోత్సహిం చాలి. కనీసం ఓ పదేళ్ల పాటు వ్యవసాయరంగ ఉత్పత్తులపై దృష్టి సారిస్తే భారతదేశం ఆర్థకంగా మళ్లీ పుంజుకోగలదు. ఆధునిక వ్యవసాయం దిశగా పురోగమించాలి. రోజురోజుకూ నిరుద్యోగం పెరిగడంతో.. ప్రజలు ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు. వారిని వ్యవసాయం వైపు మళ్లించేలా పథకాలు చేపట్టాలి. తక్షణ ఉపాధికి ఇదొక్కటే ప్రత్యామ్నాయం కాగలదు. దీంతో ఆహార ఉత్పత్తులు కూడా పెరగ గలవు. కరువులు వచ్చినా, అధికంగా వర్షాలు కురిసినా రైతుల దుర్భర పరిస్థితులలో ఎలాంటి మార్పూ కనిపించడం లేదు. మరోవైపు ప్రతి సంవత్సరం వేలాది మంది రైతులు పట్టణాలకు వలస వెళ్ళి దినసరి కూలీలుగా మారు తున్నారు. చిన్నాచితక వ్యాపారాలతో తోపుడు బళ్లు నడుపుతున్నారు. వ్యవసాయ భూమి లేని కూలీలు కౌలుకు తీసుకొని నష్టాలపాలయి బ్రతుకునీడ్చ లేక,అవమానం భరించలేక, చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇప్పుడు అనేకమంది మళ్లీ వ్యవసాయం వైపు మళ్లుతున్నారు. వారి శక్తి సామర్థ్యాలను ఉపయోగించుకునేలా చేయాలి. ఈ క్రమంలో విదేశాలకు భారీగా ఎగుమతి చేసేలా పంటలు పండించగలగాలి. దీంతో మనకు విదేశీమారకం కూడా ఆదా కాగలదు. అలా పంటలు పండించే సత్తా మన రైతాంగానికి ఉందని గుర్తుంచుకోవాలి. మన రైతులనే ప్రోత్సహించి మన పంటలనే కాపాడుకునేలా రైతాంగ విధానాలు వస్తే తప్ప వారు బతికి బట్ట కట్టేలా లేరు. రైతుల సమస్యలను పట్టించుకునే దిశగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకోవాలి. ఏటా ఒక విధానంగా గాకుండా, రుణ మాఫీలు అవసరం లేని విధంగా రైతులు స్వయం సమృద్ధిగా ఎదిగేలా చేయాలి. రైతుల సమస్యలు రాజకీయ పక్షాలకు ప్రచార కార్యక్రమంగానే మిగిలిపోయాయి. పాలకపక్షం అయినా, ప్రతిపక్షం అయినా రైతుల సమస్యలను పరిష్కరిం చడానికి చిత్తశుద్ధితో ఆలోచించడం లేదు.

# రైతులందరికీ కిసాన్ పథకం

## ఆత్మహత్యల నిరోధనానికి చర్యలు

న్యూఢిల్లీ,**జూన్ 30 ఆంధ్ర ప్రగతి**



దేశంలో 90 కోట్లకు మించి రైతు కుటుంబాలు వున్నట్లుగా ఓ అంచనా ఉంది. ప్రధాని కిసాన్ పథకం కింద ఏడాదికి మూడు సమాన వాయిదాల్లో రూ. 6000 నగదు ఇచ్చే పథకం అమలు చేస్తున్నారు. అయితే కేవలం 10.74 కోట్ల కుటుంబాలకే ఇది అందుతున్నట్లుగా తెలుస్తోంది. అంటే కేవలం 10 శాతం రైతు కుటుంబాలే ఈ కనీస లబ్ధిని పొందుతున్నాయి. 2016లో ప్రారంభించిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం పరిమిత సంఖ్యలోని రైతులకే వర్తిస్తున్నది. రైతుల కోసం ఉద్దేశించిన 17 పథకాలకు 202021 ఆర్థిక సంవత్సరంలో రూ. 17,540 కోట్లు కేటాయించగా, అందులో రూ. 5,787 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. అంటే మొత్తం బడ్జెట్ కేటాయింపులో 33శాతం మాత్రమే ఖర్చు అయింది. ఇందులో మూడు పథకాల కింద ఒక్క రూపాయి కూడా ఖర్చు కాలేదని సమాచారం. రైతు సంక్షేమం కోసం ఆచరణలో ఇంత తక్కువ స్థాయి కృషి జరుగుతున్నప్పుడు వారి ఆదాయం ఏ విధంగా రెట్టింపు అవుతుందో అర్థం కాని విషయం. 2019లో దేశ వ్యాప్తంగా కనీసం 5,957 మంది రైతులు ఆత్మహత్య చేసుకొన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. రోజుకి సగటున 16 మంది రైతులు ప్రాణత్యాగం చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం వచ్చిన తర్వాత 2014 నుంచి 2020 వరకు గల ఆరు సంవత్సరాల్లో రైతు ఆత్మహత్యలు అత్యధికంగా జరిగినట్టు వెల్లడైంది.దీనిపై కారాణాలు వెతికి ఆత్మహత్యలను నిర్మూలించే చర్యలకు ఉపక్రమించడం లేదు. దీంతో వ్యవసాయంలో కాలం కలసిరాకనో..పంటలు పండినా మద్దతుధరలు లేకనో..చేసిన అప్పులు తీర్చలేక రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. వీటిపై తక్షణం దృష్టి సారించాల్సి ఉంది.

# లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం

## చెవిరెడ్డి, వెంకటేశ్ నాయుడకుల పోలీస్ కస్టడీ

విజయవాడ,**జూన్ 30 ఆంధ్ర ప్రగతి**: వైసిపి హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్ కేసులో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వెంకటేష్ నాయుడులను మూడు రోజులపాటు సిట్ కస్టడీకి అప్పగిస్తూ ఏసీబీ కోర్టు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. అయితే తమకు ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ కోర్టును సిట్ కోరింది. కానీ వీరిని విచారించేందుకు మూడు రోజుల కస్టడీకి మాత్రమే అనుమతి ఇస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. దీంతో జులై 1 నుంచి 3వ తేదీ వరకు వీరిద్దరిని సిట్ అధికారులు విచారించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు వీరిని విచారించాలని ఆ ఆదేశాల్లో న్యాయమూర్తి స్పష్టం చేశారు. మరోవైపు ఇదే లిక్కర్ స్కామ్‌లో చెవిరెడ్డి భాస్కరరెడ్డి తనయుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి హైకోర్టులో చుక్కెదురైంది. అతడు పెట్టుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టేసింది. ఈ లిక్కర్ స్కామ్ కేసులో ఏ 39గా మోహిత్ రెడ్డి ఉన్న సంగతి తెలిసిందే. ఇంకోవైపు జైలు ప్రాంగణంలోని ఆలయానికి ప్రతి రోజు 10 నిమిషాలు వెళ్లేందుకు చెవిరెడ్డి భాస్కరరెడ్డికి ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది. అయితే జైల్లో ఉన్న తనకు బయట ఆహారం పంపాలంటూ చెవిరెడ్డి చేసుకున్న అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. అలాగే వారంలో మూడు సార్లు ములాఖత్‌లకు చెవిరెడ్డికి ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది.

# కర్ణాటకలో సిఎం మార్పు వ్యవహారం

## అంతా అదిష్టానం చేతిలో ఉందన్న ఖర్గే

బెంగళూరు,**జూన్ 30 ఆంధ్ర ప్రగతి**



కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు జరగనుందని గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కు సీఎం పగ్గాలు కట్టబెట్టబోతున్నారని చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ విషయంపై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్పందించారు. రాజధాని బెంగళూరులో మీడియా ఈ అంశంపై ప్రశ్నించడంతో ఆయన సమాధానం చెప్పారు. ముఖ్యమంత్రి మార్పు అంశం పార్టీ హైకమాండ్ చేతిలో ఉందని, పార్టీ హైకమాండ్‌లో ఏం జరుగుతుందనే విషయాన్ని ఏ ఒక్కరూ బయటికి చెప్పరని మల్లికార్జున్ ఖర్గే అన్నారు. ఈ విషయంలో చర్య తీసుకునే హక్కు హైకమాండ్‌కు మాత్రమే ఉందని, కాబట్టి విషయాన్ని హైకమాండ్‌కే వదిలేద్దామని చెప్పారు. దీనిపై ఎవరూ అనవసరమైన సమస్యలు సృష్టించవద్దని ఆయన కోరారు. కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు వార్తలు నిజమేనా అని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు ఖర్గే పైవిధంగా స్పందించారు. డీకే శివకుమార్ కర్ణాటక సీఎం కాబోతున్నారని గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్ఏ ఇక్బాల్ హుస్సేన్ ఆదివారం అదే విషయం చెప్పడంచర్చనీయాంశంగా మారింది. మరో రెండుమూడు నెలల్లో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించే అవకాశముందని హుస్సేన్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎవరు కృషి చేశారో అందరికీ తెలుసని.. ప్రస్తుతం హైకమాండ్ శివకుమార్ గురించే యోచిస్తోందని అన్నారు. డీకే శివకుమార్‌కు అత్యంత సన్నిహితుడైన ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకుంది.

# వైద్యో నారాయణో హరిః

## నేడు జాతీయ వైద్యుల దినోత్సవం

న్యూఢిల్లీ,**జూన్ 30 ఆంధ్ర ప్రగతి**

వైద్యో నారాయణో హరిః అన్నది ఆర్యోక్తి. వైద్యుడు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడితో సమానం. ఎందుకంటే ప్రాణాపాయం నుంచి మనలను గట్టెక్కించేది అతడే గనుక. మనం భూమి మీద రావడానికి ముందే డాక్టర్ సహాయం అవసరమవుతుంది. మనం పుట్టి, పెరిగి పెద్దయ్యాక కూడా వైద్యుని సహకారం ఖచ్చితంగా ఉంటుంది. అందుకే వైద్యోనారాయణ హరి అని అంటుంటారు పెద్దలు.. మనకు ఏ చిన్న రోగమొచ్చినా దాన్ని చిటికెలో నయం చేసే ఆపద్బాంధవుడు వైద్యుడే. మనలో ఎవరికైనా ప్రాణాపాయం కలిగినప్పుడు మన ప్రాణాల్ని కాపాడేందుకు శాయశక్తులా కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తారు. అంతేకాదు మనలోని మానసిక స్థితిని బట్టి, మన ప్రవర్తనకు తగ్గట్టు వ్యవహరిస్తారు. మనకు ఎలాంటి బాధ కలగకుండా మనకు చికిత్స చేసేందుకు ప్రయత్నం చేస్తారు. మనం వ్యాధి నుండి త్వరగా కోలుకునేలా చేస్తారు. ఒకవేళ మనం వ్యాధి నుండి బయటపడలేని స్థితిలో ఉంటే, మిగిలిన జీవితాన్ని హాయిగా గడిపేందుకు వారి వంతు ప్రయత్నం చేస్తారు. ఇంతటి గొప్ప యోధులని గుర్తు చేసుకునేందుకే డాక్టర్స్ డే జరుపుకుంటారు. అయితే ఈ వైద్య దినోత్సవాన్ని డాక్టర్ బిధన్ చంద్ర రాయ్



జయంతి రోజునే జరుపుకుంటారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మాజీ ముఖ్యమంత్రి, డాక్టర్ బిధన్ చంద్ర రాయ్‌ను స్మరించు కునేందుకు జులై 1వ తేదీన జాతీయ వైద్యుల దినోత్సవంగా జరుపుకోవాలని, 1991 సంవత్సరంలో కేంద్రం నిర్ణయించింది. ఆయన ఒక గొప్ప వైద్యుడు, విద్యావేత్త, స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొన్న సమర యోధుడు. శాసన ఉల్లంఘన ఉద్యమంలో కూడా ఆయన కీలక పాత్ర పోషించారు. డాక్టర్ బిదన్ చంద్ర రాయ్, పశ్చిమ బెంగాల్‌కు రెండో ముఖ్యమంత్రిగా కూడా పని చేశారు. వైద్య రంగంలో ఎన్ని మార్పులకు శ్రీకారం చుట్టారు. తన జీవితాన్ని వైద్యరంగానికి అంకితమిచ్చారు. జులై ఒకటో తేదీన ఆయన జన్మించారు.. అయితే అదే రోజున ఆయన మరణించడం విశేషం. అందుకే మనదేశంలో ఆయన జ్ఞాపకార్థం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఆయన వైద్య రంగంలోనే కాదు, రాజకీయాల్లో చాలా కీలక పాత్ర పోషించారు. 1947 సంవత్సరంలో ఉత్తరప్రదేశ్ గవర్నర్ గా కూడా పని చేశారు. 1948 సంవత్సరంలో జనవరి 23వ తేదీన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. సామాన్య ప్రజలకు సైతం వైద్యం అందుబాటులో ఉండేందుకు ఆయన ఎంతగానో కృషి చేశారు. కలకత్తాలో అనేక మెడికల్ కళాశాల లను ఏర్పాటు చేశారు. అంతేకాదు తను కలకత్తా కార్పొరేషన్ మేయర్ గా ఉన్న సమయంలో ఉచిత విద్య, ఉచిత వైద్య సేవలు, మంచి రోడ్లు, విద్యుత్ దీపాలు, నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూశారు. బెంగాల్ సిఎం అయ్యాక లా అండ్ ఆర్డర్ పై కూడా పూర్తిగా పట్టు సాధించారు. 1961లో తన ఇంటిని కూడా పేద ప్రజల కోసం విరాళంగా ఇచ్చేశారు. అదే ఏడాది అంటే 1961 ఫిబ్రవరి 4వ తేదీన భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్న అవార్డును ప్రకటించింది.

# ఉమ్మడి పౌరస్మృతిపై కానరాని కదలిక

## ఈ పార్లమెంట్ సమావేశాల్లో చర్చిస్తారా -మరోమారు ప్రజల్లో మొదలైన చర్చ

న్యూఢిల్లీ,**జూన్ 30 ఆంధ్ర ప్రగతి**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి పౌర స్మృతి బిల్లును తీసుకుని రాగలదా అన్నచర్చ సాగుతోంది. దీనిపై ఏకాభిప్రాయం మాత్రం రాదని విపక్షాల తీరును బట్టి తెలుస్తోంది. విపక్షాలు కూడా ఈ విషయంలో తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నాయి. అనంతరం దీనిని పార్లమెంటరీ స్థాయీ సంఘానికి నివేదించడం ద్వారా ముందుకు తీసుకుని రావాన్న ప్రయత్నాలు సాగడం లేదు. ఇప్పటికే దీనిపై అనేక రాజకీయ పక్షాలు విమర్శల దాడిని పెంచాయి. అయితే గత సార్వత్రిక ఎన్నికలకు ముందే దీనిని తీసుకుని వస్తారని అనుకున్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలైలో ప్రారంభం కాబోతున్నాయి. ఉమ్మడి పౌరస్మృతి బిల్లును ఈ సమావేశాల్లోనే పార్లమెంటుకు సమర్పించి, అనంతరం దానిని పార్లమెంటరీ స్థాయీ సంఘానికి నివేదించే అవకాశం ఉందని అంటున్నారు. సిబ్బంది, ప్రజా సమస్యలు, న్యాయ వ్యవస్థకు సంబంధించిన పార్లమెంటరీ స్థాయీ సంఘం షెడ్యూలు ప్రకారం, లా కమిషన్, లీగల్ అ÷ర్స్, న్యాయ మంత్రిత్వ శాఖలలోని లెజిస్లేటివ్ డిపార్ట్‌మెంట్స్ ప్రతినిధుల అభిప్రాయాలను స్వీకరిస్తుంది. దేశంలోని అన్ని వర్గాలవారికి, ప్రతి ఒక్కరికీ ఒకే చట్టం అమలు కావాలని గతంలో మోదీ పదేపదే చెప్పారు. ఈ సున్నితమైన అంశంపై ముస్లింలను కొందరు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. యూసీసీని తీసుకురావాలని సుప్రీంకోర్టు కూడా చెప్పిందని తెలిపారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్న




వారు మాత్రం దీనిని వ్యతిరేకిస్తున్నారన్నారు. ఒక దేశం రెండు రకాల వ్యవస్థలను ఎలా అమలు చేయగలదని ప్రశ్నించారు. బీజేపీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీల్లో యూసీసీ కూడా ఉన్న సంగతి తెలిసిందే. భారత రాజ్యాంగంలోని అధికరణ 44 కూడా ఉమ్మడి పౌర స్మృతిని తీసుకురావాలని చెప్తోంది. మోదీ వ్యాఖ్యలతో గత రెండుమూడేళ్లుగా యూసీసీపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది.కాంగ్రెస్ సహా కొన్ని ప్రతిపక్ష పార్టీలు దీనిని వ్యతిరేకిస్తున్నాయి. దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, మణిపూర్ హింసాకాండ వంటి సమస్యలు ఉన్నాయని, ఈ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే మోదీ యూసీసీ అంశాన్ని లేవనెత్తుతున్నారని దుయ్యబడుతున్నాయి. ఉమ్మడి పౌర స్మృతి అమల్లోకి వస్తే వివాహం, విడాకులు, దత్తత, వారసత్వం వంటి అంశాల్లో దేశంలోని ప్రజలందరికీ ఒకే రకమైన నిబంధనలు వర్తిస్తాయి. ప్రస్తుతం హిందువులు, క్రైస్తవులు, ముస్లింలు, సిక్కులకు వేర్వేరు వ్యక్తిగత చట్టాలు అమలవుతున్నాయి. హిందూ చట్టాల ప్రకారం తల్లిదండ్రుల ఆస్తిలో వారసత్వ హక్కులు పురుషులతో సమానంగా మహిళలకు కూడా ఉన్నాయి. క్రైస్తవులకు వర్తించే చట్టం ప్రకారం క్రైస్తవ మహిళలకు ముందుగా నిర్ణయించిన వాటా మాత్రమే లభిస్తుంది. పిల్లలు, ఇతర బంధువులు ఉండటాన్ని బట్టి ఈ వాటా ఉంటుంది. పారశీక మతానికి చెందిన మహిళ తన భర్త మరణించినట్లయితే, తన పిల్లలతో సమాన వాటాను పొందవచ్చు. ముస్లిం మహిళలకు తమ తండ్రి ఆస్తిలో పురుషులకు లభించే వాటాలో సగం లభిస్తుంది. అంతేకుండా చట్టాలు సమానంగా ఉంటాయి. అయితే దీనిని తీసుకుని రావడం ఎంతవరకు విజయం సాధిస్తుందన్నదే ప్రశ్న.

# మరో ఇంట్రెస్టింగ్ మూవీతో వస్తున్న అల్లరి నరేశ్.. ఆసక్తికరంగా ఫస్ట్ లుక్




ఒకప్పుడు తన కామెడీ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన నటుడు అల్లరి నరేశ్ ఇప్పుడు విభిన్నమైన కథలను ఎంచుకుంటూ నటుడిగా తన రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తున్నారు. ఈ రోజు తన పుట్టినరోజు సందర్భంగా ఆయన తన 63వ చిత్రానికి సంబంధించిన కీలక అప్‌డేట్‌ను అభిమానులతో పంచుకున్నారు. మెహర్ తేజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే ఆసక్తికర టైటిల్‌ను ఖరారు చేస్తూ, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది.ఆసక్తికరంగా ఉన్న ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇందులో అల్లరి నరేశ్ పూర్తిగా మద్యానికి బానిసైన వ్యక్తిగా, గందరగోళంలో ఉన్నట్లు కనిపిస్తున్నారు. తనదైన నటనతో కామెడీనే కాకుండా భావోద్వేగాలను కూడా అద్భుతంగా పండించగల నరేశ్.. ఈ చిత్రంలో మరో శక్తివంతమైన పాత్రతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారని స్పష్టమవుతోంది.ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌తో కలిసి శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో అల్లరి నరేశ్‌కు జోడీగా నటి రుహాని శర్మ నటిస్తుండగా, విలక్షణ సంగీత దర్శకుడు గిబ్రాన్ స్వరాలు సమకూరుస్తున్నారు. విభిన్నమైన కథాంశంతో వస్తున్న ఈ సినిమా, నరేశ్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని చిత్ర వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

# 'కే-ర్యాంప్' ఫస్ట్ లుక్

## : ఊర మాస్ లుక్‌లో కిరణ్ అబ్బవరం



యంగ్ హీరో కిరణ్ అబ్బవరం వరుస హిట్స్‌తో టాలీవుడ్‌లో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నాడు. ఇటీవలే 'క' అనే సినిమా ద్వారా బ్లాక్‌బస్టర్ అందుకున్న కిరణ్.. ఇప్పుడు మరో యూనిక్ టైటిల్‌తో తెరకెక్కుతున్న 'కే-ర్యాంప్' సినిమాతో ప్రేక్షకులను మెస్మరైజ్ చేయడానికి రెడీ అవుతున్నాడు. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను తాజాగా రిలీజ్ చేశారు. ఫస్ట్ లుక్‌లో కిరణ్ అబ్బవరం మాస్ గెటప్‌లో చొక్కా, లుంగీ ధరించి చిరునవ్వుతో స్టైల్‌గా ముందుకు నడుస్తూ కనిపిస్తున్నారు. వెనుకవైపు ఫైర్ ఎఫెక్ట్‌లతో తయారైన హార్ట్ షేప్ బాటిల్స్ డెకరేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ పోస్టర్ మొత్తం స్టైల్, ఫన్, ఫైర్ మూడూ కలగలిపినట్టుగా ఉండి సినిమా టోన్‌పై ఆసక్తిని పెంచింది. ఫస్ట్ లుక్‌తోనే అభిమానుల అంచనాలు మరింత పెరిగిపోయాయి. ఈ చిత్రానికి జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఇది ఆయన తొలి చిత్రం కాగా.. కథ, స్క్రీన్‌ప్లే కూడా ఆయనే అందిస్తున్నారు. కిరణ్‌కు జోడిగా యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాలో కూడా కిరణ్ న్యూ ఎనర్జీతో, మాస్ డైలాగ్ డెలివరీతో అభిమానులను ఆకట్టుకునేలా ఉన్నాడు. కే-ర్యాంప్ టైటిల్‌ను పోస్టర్ డిజైన్‌లో కూడా స్టైలిష్‌గా ప్రెజెంట్ చేయడం విశేషం. ఈ సినిమాను హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులోయిడ్స్ బ్యానర్లపై రాజేశ్ దండ, శివ బొమ్మక్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మ్యూజిక్ డైరెక్టర్ చేతన్ భరద్వాజ్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. కిరణ్ అబ్బవరం, చేతన్ కాంబినేషన్‌లో ఇది మూడో సినిమా కావడం విశేషం.



# ఎన్టీఆర్ సినిమా కోసం అమ్మడి డిమాండ్..!

సప్త సాగరాలు దాటి సినిమాతో సూపర్ పాపులర్ అయిన రుక్మిణి వసంత్ ఇప్పుడు టాలీవుడ్ లో ఫేవరెట్ హీరోయిన్ గా క్రేజ్ తెచ్చుకుంది. మామూలుగానే కన్నడ నుంచి వచ్చిన భామలకు మంచి డిమాండ్ ఉంటుంది. సో సప్త సాగరాలు దాటి సినిమాతో తెలుగు ప్రేక్షకులను అలరించిన రుక్మిణి ఇక్కడ వరుస ఛాన్స్ లు అందుకుంటుంది. ఆల్రెడీ నిఖిల్ తో అప్పుడో ఇప్పుడో ఎప్పుడో సినిమా చేసిన రుక్మిణి ఆ సినిమాతో అంత ఇంపాక్ట్ చూపలేకపోయింది. ఆ సినిమా కూడా ఎప్పుడో తీశారన్నట్టుగానే వచ్చింది. ఇక ఇదిలా ఉంటే ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ కాంబో ప్రాజెక్ట్ లో రుక్మిణి వసంత్ హీరోయిన్ గా ఫిక్స్ అయ్యింది. ఈమధ్యనే అమ్మడు షూటింగ్ లో పాల్గొన్నదని తెలుస్తుంది. ఎన్టీఆర్ తో ఛాన్స్ అంటే రుక్మిణికి టాలీవుడ్ లో స్టార్ స్టేటస్ వచ్చినట్టే లెక్క. ఐతే ఈ సినిమాలో నటించేందుకు గాను అమ్మడు భారీగానే రెమ్యునరేషన్ అందుకుంటుందని తెలుస్తుంది. కన్నడ సినిమాల్లో హీరోయిన్స్ కి అంత ఎక్కువ పారితోషికం ఉండదు. అక్కడ స్టార్ హీరోయిన్స్ కే కోటి కన్నా ఎక్కువ ఇవ్వరు. రుక్మిణి వసంత్ అయితే ఇప్పటివరకు మేకర్స్ ఇచ్చిన పారితోషికం తీసుకోవడమే కానీ తను డిమాండ్ చేసింది లేదు. ఐతే ఎన్టీఆర్ సినిమాకు మాత్రం అమ్మడు కోటిన్నర దాకా రెమ్యునరేషన్ డిమాండ్ చేసిందని టాక్. తెలుగు హీరోయిన్స్ అది కూడా కాస్త ఫాం లో ఉన్న హీరోయిన్స్ కి కోటిన్నర ఏంటి 2 కోట్ల నుంచి 3 కోట్లు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఐతే ఈమధ్య స్టార్ హీరోలంతా భారీగా రెమ్యూనరేషన్ పెంచారు కాబట్టి హీరోయిన్స్ కూడా అందుకు తగినట్టుగానే డిమాండ్ చేయాలని ఫిక్స్ అయ్యారు.



# 'కన్నప్ప'పై పైరసీ పంజా..

ప్రతిష్ఠాత్మకంగా, పాన్ ఇండియా స్థాయిలో రూపుదిద్దుకున్న 'కన్నప్ప' చిత్రంపై పైరసీ భూతం పంజా విసిరింది. ఈ చిత్రానికి సంబంధించిన వేలాది పైరసీ లింకులు ఆన్‌లైన్‌లో ప్రత్యక్షం కావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామంపై 'కన్నప్ప' చిత్ర బృందం తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు హీరో మంచు విష్ణు హార్ట్ బ్రేకింగ్ అంటూ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. ఇప్పటివరకు 30,000కు పైగా పైరసీ లింకులను గుర్తించి తొలగించినట్లు వెల్లడించారు.

"మా 'కన్నప్ప' సినిమా పైరసీకి గురవుతోంది. ఇది చాలా బాధాకరం. ఇప్పటికే 30,000 పైచిలుకు పైరసీ లింకులను తొలగించాం. పైరసీ అనేది ముమ్మాటికీ దొంగతనమే. మనం మన పిల్లలకు దొంగతనం చేయమని నేర్పించం కదా? పైరసీ కంటెంట్ చూడటం కూడా అలాంటిదే. దయచేసి దీనిని ప్రోత్సహించకండి. సరైన మార్గంలో సినిమాకు మద్దతు ఇవ్వండి" అని విష్ణు విజ్ఞప్తి చేశారు.

ఎంతో శ్రమ, పెట్టుబడితో నిర్మించే సినిమాలను పైరసీ రూపంలో దెబ్బతీయడం దారుణమని ఆయన పేర్కొన్నారు. సినిమా పరిశ్రమను తీవ్రంగా నష్టపరిచే పైరసీని అరికట్టేందుకు ప్రేక్షకుల సహకారం ఎంతో అవసరమని విష్ణు అభిప్రాయపడ్డారు. సినిమాను థియేటర్లలో లేదా అధికారిక ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో మాత్రమే చూసి, తమ కష్టానికి ప్రతిఫలం అందించాలని కోరారు.



# క్రేజీ మూవీకి సీక్వెల్

'ఈ నగరానికి ఏమైంది' సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులని, ముఖ్యంగా యువతను ఆకట్టుకుని సంచలన విజయం సాధించి కల్ట్ క్లాసిక్‌గా నిలిచింది. సినిమా రీరిలీజ్ మరింత ఆసక్తిని కలిగించింది. ఇప్పుడు అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా సీక్వెల్ ను అధికారికంగా ప్రకటించారు. 'ఈఎన్ఈ రిపీట్ 'టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో మళ్ళీ అదరగొట్టబోతోందనే హామీ ఇస్తోంది. దాదాపు ఒరిజినల్ స్టార్ కాస్ట్, టెక్నికల్ టీంతో తిరిగి వస్తోంది ఈ సీక్వెల్. ఫస్ట్ పార్ట్‌లో అందరినీ అలరించిన గ్యాంగ్ విశ్వక్ సేన్, సాయి సుశాంత్ రెడ్డి, అభినవ్ గోమటం, వెంకటేష్ కాకుమాను మరోసారి అలరించబోతున్నారు. తరుణ్ భాస్కర్ ఈ సీక్వెల్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్ ఒరిజినల్స్, సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై డి. సురేష్ బాబు, సృజన్ యరబోలు, సందీప్ నాగిరెడ్డి నిర్మిస్తున్నారు.

# గురూజీ కాంపౌండ్ లో రానా!



యంగ్ టైగర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో భారీ మైథలాజికల్ థ్రిల్లర్ చిత్రం లాక్ అయినట్లు ప్రచారంలో ఉన్న సంగతి తెలిసిందే. బన్నీ చేయాల్సిన స్క్రిప్ట్ తిరిగి తిరిగి తారక్ వద్దకు చేరినట్లు వినిపిస్తుంది. బన్నీ అట్లీకి లాక్ అయిన తర్వాత ఇదే స్టోరీ రామ్ చరణ్ వద్దకు వెళ్లిందని ప్రచా రంలోకి వచ్చింది. అక్కడ నుంచి తారక్ వద్దకు వెళ్లినట్లు జోరుగా వినిపిస్తుంది. తారక్ కూడా లాక్ చేసినట్లు వార్తలొస్తున్నాయి. అభిషేక్ ఈ నేపథ్యంలో తాజాగా మరో కొత్త అంశం తెరపైకి వచ్చింది. ఈ కథలో దగ్గుబాటా రానా ఎంటర్ అవుతు న్నాడుట. ఇందులో ప్రతి నాయకుడి పాత్రకు గురూజీ రానాని తీసుకుంటున్నట్లు కొత్త వార్త వినిపిస్తుంది. ఈ పాత్ర ఒక స్వామిజీ తరహాలో ఉంటుందని... ప్రధాన ప్రతి నాయకుడి పాత్రగా వినిపిస్తుంది. మరి ఇందులో నిజమెంతో తెలియాలి. ఇదే నిజమైతే రానాకిది మంచి అవకాశమే. %-%వెట్టేయాన్%-% తర్వాత రానా వెండి తెరపై కనిపించలేదు. అందులో విలన్ పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత మళ్లి ఇంత వరకూ మరో సినిమా చేయ లేదు. హీరోగానూ కనిపించలేదు. విలన్ గానూ కనిపిం చలేదు. మధ్యలో నిర్మాతగా మాత్రమే బిజీగా ఉన్నా డు. హిరణ్యకశిష ప్రాజెక్ట్ అనుకున్నా? అది కార్యరూపం దాల్చలేదు. ఇలా కొంత కాలంగా రానా బండి లాగుతున్నాడు. తాజాగా గురూజీ రూపంలో మరో అవకాశం దక్కినట్లు అయింది. విలన్ పాత్రలు రానాకి కొత్తేం కాదు. %-%బాహుబలి%-%తో పాన్ ఇండియాలోనే విలన్ గా ఫేమస్ అయ్యాడు. భల్లాల దేవ పాత్రతో తన కంటూ ఓ ఇమేజ్ ను క్రియేట్ చేసుకున్నాడు. మళ్లీ అంతటి బలమైన పాత్రలు రాలేదు. ఈ నేపథ్యంలో త్రివిక్రమ్ ఆ రేంజ్ రోల్ ఇస్తున్నట్లే కనిపిస్తుంది.